హైదరాబాద్ వార్త



# అప్పులు..అవస్థలు

- వ్యాపారాలు,వాటి విస్తరణకు అధికవడ్డీలకు అప్పులు
- లక్షలు, కోట్లలో తీసుకుంటున్న వ్యాపారులు
- ఆ డబ్బు చెల్లించకుండా న్యాయస్థానాల బాట
- దీంతో అప్పు ఇచ్చిపుచ్చుకున్నవారి మధ్యవైషమ్యాలు
- హత్యలు, ఆత్మహత్యలను ప్రేరేపిస్తున్న పలు సంఘటనలు



**హైదరాబాద్, అక్టోబరు 13,ప్రభాతవార్త:** నగరంలోని హయత్‌నగర్ ప్రాంతంలో వ్యాపార రంగంలో పేరొందిన ఒకుటుంబం కొన్నాళ్లుగా కనిపించటం లేదు. వ్యాపారంలో నష్టం రావటంతో దివాళా తీసినట్లు ఆమోదించాలంటూ సదరు వ్యాపారి.. న్యాయస్థానాన్ని ఆశ్రయించినట్లు తెలుస్తోంది. న్యాయస్థానం దీనిని ఇంకా ఆమోదించకున్నా ఆకుటుంబానికి రూ. లక్షలు, రూ. కోట్లలో అప్పులిచ్చినవారు ఆందోళనకు గురవుతున్నారు. అలాగే మలక్‌పేట్‌లో వైద్య సేవల విస్తరణకు ఓ వ్యాపారి భారీగా అప్పులు చేశారు. వ్యాపారంలో తీవ్రంగా నష్టపోయారు. అప్పు ఇచ్చినవారి నుంచి ఒత్తిడి పెరగటంతో బలవన్మరణానికి పాల్పడ్డారు. సదరు వ్యాపారి కుటుంబం దెబ్బతినటంతోపాటు అప్పు ఇచ్చినవారు నష్టపోయారు. వ్యాపారంలో నష్టపోయినవారు దివాళా తీసినట్లు ప్రకటించాలని న్యాయస్థానాలను ఆశ్రయిస్తు ఐపిలు పెడుతున్నారు. ఇటువంటి ఘటనలు వ్యాపార వర్గాలు, ప్రజల్లో ఆందోళన కలిగిస్తున్నాయి.

### వ్యాపారాల విస్తరణ...

కొందరు వ్యాపారులు తమ వ్యాపార సామ్రాజ్యాన్ని విస్తరించేందుకు తెలిసినవారి నుంచి వడ్డీలకు అప్పులు తెస్తున్నారు. అధిక వడ్డీ ఆశతో బ్యాంకుల్లో ఫిక్స్ డిపాజిట్ల కన్నా వ్యాపారులకు అప్పు ఇచ్చేందుకు కొంతమంది ఆసక్తి చూపుతున్నారు. వ్యాపారులు ప్రాంసరీ నోట్లు, ఖాళీ చెక్కులు రాసివ్వటంతోపాటు కొందరు గృహాలు, ఇళ్ల స్థలాలను షూరిటీగా పెడుతున్నారు.

### అత్యాశకు పోవద్దు..

వ్యాపారాల విస్తరణకు కొందరు వ్యాపారులు అధిక వడ్డీలకు అప్పులు చేస్తున్నారు. వ్యాపారంలో వచ్చే లాభం వడ్డీలు చెల్లించేందుకు సరిపోదు. వ్యాపార విస్తరణలో ఆచితూచి అడుగులు వేయాలి. పెట్టిన పెట్టుబడులకు భరోసా లేకుండా వ్యాపారం చేయవద్దు. అప్పు తీసుకునే సమయంలోనూ తాము తీర్చగలమా లేదా అని పలు మార్లు ఆలోచించాలి. కష్టకాలంలో ఆర్థికంగా చేయూతనిచ్చిన వారికి తిరిగి అప్పు చెల్లించాలి. అప్పు ఇచ్చేవారు సైతం అధిక వడ్డీలను ఆశిస్తే నష్టపోతామని గుర్తించాలి. సానుకూల వ్యాపారాలు చేసేవారికి ధర్మ వడ్డీకి అప్పులు ఇవ్వాలి. ఆర్భాటపు వ్యాపారాలను చూసి, కొద్దిరోజుల క్రితమే పరిచయమైనవారి మాయమాటలు నమ్మి మోసపోవద్దు.

### కుటుంబాలు ఛిన్నాభిన్నం..

కాలం కలిసిరాక కొందరు వ్యాపారంలో నష్టపోతున్నారు. నెలనెలా వడ్డీలు చెల్లించాల్సి రావటంతో తీవ్రమైన ఆర్థిక ఒత్తిడిని ఎదుర్కొంటున్నారు. నెలలపాటు వడ్డీ, అసలు చెల్లించలేక అప్పు ఇచ్చిన వారి నుంచి నిరసనలు, ఆగ్రహాలను చవిచూస్తున్నారు. సదరు వ్యాపారులు మనస్తాపంతో బలవన్మరణాలకు పాల్పడుతున్నారు. మరికొందరు వ్యాపారులు దురాలోచనతో బినామీ పేర్లతో ఆస్తులను కూడబెట్టి వ్యాపారంలో నష్టపోయినట్లు ప్రకటిస్తున్నారు. వారికి అప్పులిచ్చిన కుటుంబాలు ఆర్థికంగా చితికిపోతున్నాయి. తినీతినకా కూడబెట్టుకున్నామని, పిల్లల పెళ్లికి దాచుకున్నామని, తమ పిల్లల విద్యకు ఉపయోగపడుతుందనుకున్నామని అప్పు ఇచ్చి నష్టపోయిన కుటుంబాలు ఆవేదన చెందుతున్నాయి. వ్యాపారాల విస్తరణ కోసం అధిక వడ్డీలకు అప్పు చేయొద్దు. అప్పు ఇచ్చేవారూ అత్యాశకు పోవద్దు. సానుకూలంగా ఉంటేనే ఆర్థికంగా ఇద్దరికీ మేలు జరుగుతుంది. పెద్దమొత్తాలను ఒక్కరికే ఇవ్వొద్దు. ఆత్మహత్య ఘటనలతో అప్పు ఇచ్చినవారు అడగలేని పరిస్థితి ఏర్పడుతోంది.

# స్విమ్మింగ్ పూల్‌లో పడి బాలుడు మృతి



బాలుడు మ ృతిచెందిన స్విమ్మింగ్ పూల్

**గచ్చిబౌలి, అక్టోబరు 13 ప్రభాతవార్త** ప్రమాదవశాత్తు స్విమ్మింగ్ పూల్‌లో పడి నాలుగేళ్ల బాలుడు మృతిచెందాడు. స్విమ్మింగ్ పూల్‌కు సమీపంలోనే బాలుడి కుటుంబం నివాసం ఉంటుండగా, ఆడుకుంటూ వెళ్లిన బాలుడు ప్రమాదవశాత్తు స్విమ్మింగ్ పూల్‌లో పడిపోయాడు. గచ్చిబౌలి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకున్న ఈ సంఘటనకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి.. నేపాల్‌కు చెందిన మహేందర్ రావు, నిర్మల దంపతులు తమ కుమారుడు సూరజ్ రోత్(4)తో కలిసి గతకొన్ని రోజుల క్రితం బ్రతుకు దెరువు కోసం నగరానికి వలస వచ్చారు. మజీద్‌బండలోని పారామౌంట్ హిల్స్ కాలనీలో నివాసం ఉంటూ వాచ్‌మెన్‌గా పనిచేస్తున్నారు. కాగా వీరు నివాసం ఉంటున్న ఇంటికి దగ్గరలోనే ది క్లబ్ సెమీ గేటెడ్ కమ్యూనిటీ ఉండగా, అందులో ఓ స్విమ్మింగ్ పూల్ ఉంది. ఈనెల 12వ తేదీన మద్యాహ్నం 2.50 గంటల ప్రాంతంలో ఇంటి ముందు ఆడుకుంటూ సూరజ్ రోత్ పక్కనే ఉన్న స్విమ్మింగ్ పూల్ వద్దకు వచ్చాడు. స్విమ్మింగ్ పూల్ గేటు తాళం వేసి ఉండగా, కింద నుంచి లోపలికి వెళ్లిన బాలుడు ప్రమాదవశాత్తు స్విమ్మింగ్ పూల్ నీటిలో పడి మృతి చెందాడు. కొద్దిసేపటికి బాలుడు కనిపించకపోవడంతో స్థానికంగా గాలించిన బాలుడి తల్లి స్విమ్మింగ్ పూల్ వద్దకు వచ్చి చూడగా నీళ్లలో నిర్జీవంగా బాలుడి మ ృతదేహం కనిపించింది. బాలుడు స్విమ్మింగ్ పూల్‌లో పడిపోతున్న దృశ్యాలు అక్కడి సిసి కెమెరాల్లో రికార్డు అయ్యాయి. ఈ మేరకు స్థానికులు పోలీసులకు సమాచారం అందించగా, సంఘటనా స్థలికి చేరుకున్న పోలీసులు మ ృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆసుపత్రికి తరలించి, కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.

# రోడ్డు విస్తరణ బాధితుల ర్యాలీ




ర్యాలీ నిర్వహిస్తున్న బాధితులు

**అల్వాల్, అక్టోబరు 13 ప్రభాతవార్త:** రాజీవ్ రహదారి రోడ్డు విస్తరణలో ఆస్తులు కోల్పోతున్న బాధితులు సోమవారం భారీ ర్యాలీ నిర్వహించారు. వ్యాపారస్తులు స్వచ్ఛందంగా దుకాణాలు మూసి వేయడం జరిగింది. రోడ్డు విస్తరణను 200 అడుగులకు బదులుగా 120 అడుగులు మేరకు మాత్రమే చేయాలని వారు డిమాండ్ చేశారు. లోతుకుంట నుంచి గోల్నాక అల్వాల్ చౌరస్తా వరకు జరిగిన ర్యాలీలో ప్రజలుతో పాటుగా వ్యాపారస్తులు పాల్గొన్నారు. దశాబ్దాలు కాలంగా ఉద్యోగాలు చేసి కూడబెట్టుకున్న సొమ్ముతో కట్టుకున్న ఇళ్ళు పూర్తిస్థాయిలో విస్తరణలో కోల్పోతున్నామని పలువురు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం రోడ్డు విస్తరణను 120 అడుగులు మేరకు చేయడం ద్వారా అధిక శాతం మంది ఆస్తులకు ఇబ్బందులు ఉండవన్నారు. వ్యాపారస్తులు పూర్తిగా తమ జీనోపాధిని కోల్పోవాల్సిన పరిస్థితి ఉందన్నారు. ఆస్తులు సేకరణలో ప్రభుత్వం పరంగా ఇచ్చే నష్ట పరిహారం చాలా తక్కువగా ఉందని తెలిపారు. ప్రభుత్వం తమను పూర్తిగా రోడ్డున పడేస్తోందని పేర్కొన్నారు. విస్తరణకు సంబంధించి న్యాయ స్థానాలులో కేసులు ఉన్నందున వాటిపై తీర్పు వచ్చేంత వరకు ప్రభుత్వం ఎటువంటి చర్యలు తీసుకోరాదని వారు కోరారు. నష్ట పరిహారం కోసం ముందస్తుగానే బ్యాంకు అకౌంట్లు అధికార యంత్రాంగానికి ఇవ్వరాదని రోడ్డు విస్తరణ బాధితుల సంఘం జెఎసి నిర్ణయించింది. బాధితులు సమస్యలు అన్నింటికి ప్రభుత్వం నుంచి సానుకూలమైన స్పందన వచ్చిన తరువాతే అకౌంట్ వివరాలు అందివ్వాలని జెఎసి చైర్మన్ సతీష్ గుప్త తెలిపారు. రోడ్డు విస్తరణలో వ్యాపార సంబంధమైన ఆస్తులను కోల్పోతున్న వారికి నగరంలో స్థలాలు కేటాయించాలని ఆయన డిమాండ్ చేశారు. వ్యాపార సముదాయాలులో పని చేస్తున్న కార్మికులకు స్వయం ఉపాధి లేదా ప్రభుత్వ ఉద్యోగం కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో రాజీవ్ రహదారి ఆస్తులు యాజమాన్యం జెఎసి సి బ్లాక్ ఇన్‌చార్జి డాక్టర్ సుధాకర్, రాఘవేంద్ర రావు, గుమ్మడి నవీన్ రెడ్డి, సురాణా అగర్వాల్, వెంకటేష్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

# రాయదుర్గంలో ద్విచక్రవాహనాల దొంగ అరెస్టు..14 బైకులు స్వాధీనం



స్వాధీనం చేసుకున్న వాహనాలతో రాయదుర్గం పోలీసులు

**గచ్చిబౌలి, అక్టోబరు 13 ప్రభాతవార్త** మద్యానికి బానిసగా మారిన వ్యక్తి డబ్బు కోసం ద్విచక్రవాహనాలను దొంగిలించసాగాడు. చోరీ చేసిన వాహనాలను 3నుంచి 5వేల ధరకు ఇతరులకు విక్రయిస్తూ వచ్చిన డబ్బుతో జల్సాలు చేస్తున్నాడు. గత ఏడాదిన్నర కాలంగా 14 ద్విచక్ర వాహనాలను చోరీ చేసిన నిందితుడిని ఎట్టకేలకు రాయదుర్గం పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ కేసుకు సంబంధించిన వివరాలను సోమవారం రాయదుర్గం పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఏసిపి శ్రీధర్ వెల్లడించారు.. వికారాబాద్ జిల్లా తాండూరు మండలం మల్కాపూర్‌కు చెందిన కటాయి రాములు(23) జీహెచ్‌ఎంసీలో చెత్త కార్మికుడిగా పనిచేస్తూ లింగంపల్లి రైల్వే స్టేషన్ పరిసరాల్లో నివాసం ఉంటున్నాడు. కాగా మద్యానికి బానిసగా మారిన రాములును భార్య వదిలిపెట్టింది. మద్యం తాగేందుకు డబ్బు కోసం రాములు ద్విచక్రవాహనాల దొంగతనాలు చేయడం ప్రారంభించాడు. ఈ క్రమంలో గత ఏడాదిన్నర కాలంగా రాయదుర్గం పరిధిలో 8, చందానగర్ పరిధిలో 5, ఫిలింనగర్ పరిధిలో ఓ బైక్‌ను చోరీ చేశాడు. చోరీ చేసిన వాహనాలను 3నుంచి 5వేల ధరకు ఇతరులకు విక్రయిస్తూ వచ్చిన డబ్బుతో మద్యం తాగేవాడు. కాగా ఈనెల 12వ తేదీన చందానగర్‌లో ఓ బైక్ చోరీ చేసి అదే వాహనం మీద రాయదుర్గం వైపు వస్తుండగా, మైఫిల్ హోటల్ వద్ద వాహనాల తనిఖీ చేస్తున్న పోలీసులకు పట్టుబడ్డాడు. రాములును అదుపులోకి తీసుకున్న రాయదుర్గం పోలీసులు విచారించగా మొత్తం 14బైక్ చోరీలకు పాల్పడినట్లు వెల్లడించాడు. దీంతో రాములును అరెస్టు చేసిన పోలీసులు నిందితుడి వద్ద నుంచి 6.50లక్షల విలువైన 14 బైక్‌లను స్వాధీనం చేసుకున్నారు. ఈమేరకు నిందితుడిని రిమాండ్‌కు తరలించారు. సమావేశంలో రాయదుర్గం ఇన్స్‌పెక్టర్ వెంకన్న, డిఐ భూపతి తదితరులు పాల్గొన్నారు.

# బిర్యానీలో బొద్దింక

-హోటళ్ళ పై కొరవడిన నిఘా.
- శుభ్రత పాటించని హోటల్ యాజమాన్యాలు



గుడిమల్కాపూర్ గోల్డెన్ ప్యాలెస్ హోటల్ బిర్యానీలో బొద్దింక దర్శనం

**మెహిదీపట్నం అక్టోబర్ 13, ప్రభాతవార్త :** ప్రజలకు ఆహారాన్ని విక్రయిస్తూ ధనార్జనే ధ్యేయంగా వారికి అందించే ఆహారం విషయంలో మాత్రం జాగ్రత్తలు పాటించడం లేదు హోటల్ యజమానులు. దీంతో హోటల్ లో భోజనాలు చేసేవారు అనారోగ్య పాలవుతున్నారు. ఈ విషయంలో చర్యలు తీసుకోవాల్సిన సంబంధిత జిహెచ్‌ఎంసి ఫుడ్ సేఫ్టీ అధికారులకు ఫిర్యాదులు అందినా పట్టించుకోకపోవడం పలు అనుమానాలకు తావిస్తోంది. వివరాల్లోకి వెళితే ఈనెల 9న గుడిమల్కాపూర్ గోల్డెన్ ప్యాలెస్ హోటల్ లో సోమాచారి అనే వ్యక్తి రూ. 650 చెల్లించి ఒక బిర్యానీ పార్సిల్ ను తన ఇంటికి తీసుకువెళ్లాడు. ఇంటికి బిర్యానీతో వెళ్లిన సోమచారి తన కుటుంబ సభ్యులతో కలిసి భోజనం చేద్దామని బిర్యానీ ప్యాకెట్‌ను ఓపెన్ చేయగా అందులో నుండి బొద్దింక బయటపడింది. దీంతో ఆందోళనకు గురి అయిన సోమచారి వెంటనే సంబంధిత ఫుడ్ సేఫ్టీ అధికారిని రాజేశ్వరి కి ఫిర్యాదు చేశాడు. దీంతో స్పందించిన అధికారిని రాజేశ్వరి హోటల్ ను తనిఖీ చేసి వెళ్ళిందని అయితే తనకు అధికారుల నుండి ఎలాంటి న్యాయం జరగలేదని బాధితుడు ఆవేదన వ్యక్తం చేశాడు. నాణ్యత లేని ఆహారం సరఫరా చేస్తూ ప్రజల ప్రాణాలకు సంకటంగా మారిన హోటల్ పై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశాడు. తన ఫిర్యాదు పై స్పందించి హోటలను తనిఖీ చేసిన అధికారులు చర్యలు తీసుకోకపోవడం పై బాధితుడితో పాటు స్థానిక ప్రజలు ఫుడ్ సేఫ్టీ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

# లే ఔట్లలో పార్కుల ఆక్రమణలు

-హైడ్రా ప్రజావాణికి 48 ఫిర్యాదులు



ఫిర్యాదుదారులతో మాట్లాడుతున్న కమిషనర్ రంగనాథ్

**హైదరాబాద్, అక్టోబర్ 13,ప్రభాతవార్త:** ప్లాట్ పక్కన పార్కు ఉంటే మాయం చేస్తున్నారు. డెడ్ ఎండ్ రోడ్డు ఉంటే కబ్జా చేస్తున్నారు. లే ఔట్ స్వరూపాలను మార్చేస్తున్నారు. చెరువులను కలుపుతూ సాగే వరద కాలువలను కూడా ఇష్టానుసారం మలుపులు తిప్పుతున్నారు. దీంతో కాలనీలు, బస్తీలు నీట మునుగుతున్నాయని పలువురు నివాసితులు హైడ్రాకు ఫిర్యాదు చేశారు. రహదారులను ఆక్రమించేసి వ్యాపారాలు చేస్తుండడంతో ఆ మార్గంలో వెళ్లడానికి ఇబ్బందులు పడాల్సి వస్తోందని పలువురు వాపోయారు. శ్మశానవాటికలతో పాటు చెరువులను చెరబడుతున్నారని పలురువు హైడ్రాను ఆశ్రయించారు. రావిర్యాల పెద్ద చెరువు ఎఫ్‌టీఎల్ కంటే ఎక్కువ నీరు వచ్చి చేరడంతో పైన ఉన్న హెచ్‌ఎండీఏ అనుమతి పొందిన లే ఔట్లు కూడా మునిగిపోతున్నాయని పలువురు ఫిర్యాదు చేశారు. మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా బాచుపల్లి మండలం కౌశల్యా కాలనీలో పార్కుతో పాటు.. రహదారులను కబ్జా చేసి దుకాణాలు ఏర్పాటు చేశారని.. దీంతో రాజీవ్‌గాంధీనగర్ నుంచి మియాపూర్ ప్రధాన రహదారికి చేరడం కష్టంగా ఉందని పలువురు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఇలా సోమవారం హైడ్రా ప్రజావాణికి మొత్తం 48 ఫిర్యాదులు అందాయి. ఈ ఫిర్యాదులను హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్‌స్వయంగా పరిశీలించి సంబంధిత అధికారులకు వాటి పరిష్కార బాధ్యతలు అప్పగించారు.




సికింద్రాబాద్ మినిస్టర్ రోడ్డు ప్రాంతంలో ఉన్న ఆటో మొబైల్ దుకాణందారులు ప్లాస్టిక్ చెత్త రోజు పడేస్తుడడంతో పెరుకుపోయింది.సోమవారం ఆ చెత్తలో మంటల చెలరగేడంతో మంటలను అర్పుతున్న ఫైర్ సిబ్బంది

# ఒకే చిరునామాలో ఓట్లపై విచారణ



విచారిస్తున్న అధికారులు

**జూబ్లీహిల్స్, అక్టోబరు 13, ప్రభాతవార్తః** యూసుఫ్‌గూడలోని ఒక ఇంటి నంబరుతో 43 ఓట్లు నమోదై ఉన్న వ్యవహారంపై అధికారులు దృష్టి సారించారు. కృష్ణానగర్ బి బ్లాక్ బూత్ నంబరు 246లో ఒక ఇంటి నంబరుపై 43 ఓట్లు నమోదై ఉన్నట్లు బీఆర్‌ఎస్ నేతలు గుర్తించారు. దీనిపై ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేయగా సోమవారం సంస్కృతి ఎవెన్యూ పేరుతో ఉన్న ఇంటికి అధికారులు వచ్చారు. అక్కడ విచారించగా ఆయా చిరునామాతో ఉన్న ఓటరు కార్డుదారులు ఎవరూ అక్కడ ప్రస్తుతం నివసించడం లేదని గుర్తించారు. నూతన నిర్మాణం కావడంతో గతంలో ఎవరైనా నివసించారా అనే కోణంలో విచారించారు. భవన యజమానిని ఓటరుకార్డుదారుల వివరాలు అడిగి సేకరించారు. ఓటరుకార్డులో ఉన్న కార్డుదారులను గతంలో ఓటు వేసిన బూత్‌తోపాటు ప్రస్తుత చిరునామాను గుర్తించేందుకు అధికారులు ప్రయత్నిస్తున్నారు. మరోవైపు కాంగ్రెస్ పార్టీ నేతలు ఈ దొంగ ఓట్లను నమోదు చేసిందని బీఆర్‌ఎస్ నేతలు ఆరోపిస్తున్నారు. ఈ ఓట్లను రద్దు చేయాలంటూ వారు డిమాండ్ చేస్తున్నారు.

## పోలింగ్ సిబ్బంది మొదటి దశ ర్యాండమైజేషన్ పూర్తి



అధికారులతో సమావేశమైన ఎన్నికల అధికారి ఆర్.వి.కర్ణన్

**హైదరాబాద్, అక్టోబర్ 13, ప్రభాతవార్త:** జూబ్లీ హిల్స్ అసెంబ్లీ నియోజకవర్గ ఉప ఎన్నిక నిర్వహణకు సంబంధించి పోలింగ్ సిబ్బంది మొదటి దశ ర్యాండమైజేషన్ ప్రక్రియ పూర్తి అయ్యింది. జిహెచ్‌ఎంసి ప్రధాన కార్యాలయంలో జిల్లా ఎన్నికల అధికారి, జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఆర్ వి కర్ణన్, అదనపు కమిషనర్ ( ఎన్నికల విభాగం) హేమంత్ కేశవ్ పాటిల్, అదనపు కమిషనర్ ( రెవెన్యూ , ఐటి) అనురాగ్ జయంతిలతో కలిసి ఆన్‌లైన్ ద్వారా పిఓ, ఎపిఓ , ఓపిఓల మొదటి దశ ర్యాండమైజేషన్ ప్రక్రియను నిర్వహించారు.

# ఆర్యవైశ్యుల సంక్షేమానికి ప్రత్యేక నిధులు : కల్వ సుజాత



లక్ష గౌరమ్మలపూజలో పాల్గొని ప్రసంగిస్తున్న తెలంగాణ ప్రభుత్వ ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మెన్ కల్వ సుజాత

**కుత్బుల్లాపూర్, అక్టోబరు 13 ప్రభాతవార్త** ఆర్యవైశ్యులు అన్నిరంగాలలో సమర్థవంతంగా ఎదిగేందు కు కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సహాయ, సహకారాలతో ముందుకు వెలుతున్నట్లు తెలంగాణ ప్రభుత్వ ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్‌పర్సన్ కల్వ సుజాత తెలిపారు. సోమవారం చింతల్ కుత్బుల్లాపూ ర్ ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో కుత్బుల్లాపూర్ డివిజన్ పద్మానగర్ ఫేజ్-1లోని శ్రీ వెంకటేశ్వరస్వామి పేజ్‌లోని విమాన వెంకటేశ్వరస్వామి ఆలయప్రాంగాణంలో నిర్వహిం చిన లక్ష గౌరమ్మల పూజకు ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొ న్నారు. ఈసందర్భంగా చింతల్ కుత్బుల్లాపూర్ ఆర్యవైశ్య సంఘ అధ్యక్షులు జూలూరు విజయ్‌కుమార్‌గుప్తా అధ్యక్ష తన చింతల్ కుత్బుల్లాపూర్ ఆర్యవైశ్యసంఘ మహిళా విభాగ్ అధ్యక్షులు సంధ్యారాణి, ప్రధానకార్యదర్శి జూలూ రు పద్మ, కోశాధికారి మురికి రాజ్యలక్ష్మిలఆధ్వర్యంలో లక్ష గౌరమ్మల పూజకార్యక్రమానికి ఆమె ముఖ్యఅధిదిగా పాల్గొని ప్రసంగించారు. చింతల్ కుత్బుల్లాపూర్ ఆర్యవైశ్య సంఘనాయకత్వంలో స్థానికంగా కులదైవమైన శ్రీ వాసవి కన్యకాపరమేశ్వరీదేవి ఆలయ నిర్మాణానికి స్థానిక సంఘం పూనుకుంటే తన పూర్తి సహాయ, సహకారాలు అందిస్తా నని హామీఇచ్చారు. రంగారెడ్డిజిల్లా ఆర్యవైశ్య మహాసభ మాజీ అధ్యక్షులు పార్శి ప్రకాశ్‌గుప్తా, కుత్బుల్లాపూర్ మండల ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షులు వాస శ్రీనివాస్‌గుప్తా, జగద్గిరిగుట్ట శ్రీ వాసవి కన్యకాపరమేశ్వరీ ఆలయ కమిటీ చైర్మెన్ నేతి శంకర్‌గుప్తా, సరస్వతి శ్రీనివాస్‌గుప్తాలను ఘనంగా సత్కరించారు.సమావేశంలో మేడ్చెల్ మల్కాజ్ గిరి జిల్లా ఆర్యవైశ్యసంఘ అధ్యక్షులు బెలిదె రమేశ్‌గుప్తా, చింతల్ కుత్బుల్లాపూర్ ఆర్యవైశ్యసంఘ అధ్యక్షులు జూలూ రు విజయ్‌కుమార్‌గుప్తా ,అధ్యక్షులు జూలూరు విజయ్ కుమార్‌గుప్తా, మహంకాళి ప్రభురాజ్‌గుప్తా, జూలూరు వీరేందర్‌గుప్తా, ఇల్లెందుల కృష్ణకుమార్ గుప్తా, ఒడుగూరి రాజు గుప్తా, చెన్నా శ్రీనివాస్ గుప్తా, ఉప్పల శ్రీనివాస్ గుప్తా,ఇడుకుల కృష్ణమూర్తిగుప్తా, నేతి జగన్నాధం గుప్తా,, గోపారపు ఆంజనేయులు గుప్తా, నల్లనాగుల సంతోశ్‌కు మార్ గుప్తా, గోపారపు ఆంజనేయులు గుప్తా,, బెజగం రాజుగుప్తా, సత్యప్రసాద్ గుప్తా, నారాయణ ప్రసాద్‌గుప్తా, నల్ల రాజయ్య గుప్తా ఏర్పాట్లను నిర్వహించారు.

## హనుమాన్‌నగర్‌లో రోడ్డు పనులు ప్రారంభం



రోడ్డు పనులు ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న బిజెపి నాయకులు

**చార్మినార్, అక్టోబరు 13 ప్రభాతవార్త :** మొగల్‌పుర డివిజన్ పరిధిలోని హనుమాన్‌నగర్ దేవాలయం ఎదురుగా నూతన రహదారి పనులు సోమవారం ప్రారంభమయ్యాయి. డివిజన్ పరిధిలోని పలు బస్తీలలో రోడ్లు వేయటం జరిగిందని బిజెపి నాయకులు తెలిపారు. ఈ సందర్భంగా సీనియర్ బిజెపి నాయకులు రూప్‌రాజ్ మాట్లాడుతూ ప్రజలకు అవసరమైన కనీస వసతులు కల్పించటానికి అన్ని విధాల కృషి చేస్తానని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ పాశం సురేందర్, సీనియర్ బిజెపి నాయకులు రూప్‌రాజ్, ఎం.కుమార్, కరణ్‌జీ, లక్ష్మణ్ పాల్గొన్నారు.

## అమిన్ పటేల్‌ను కలిసిన పాతబస్తీ కాంగ్రెస్ నాయకులు

**చార్మినార్, అక్టోబరు 25 ప్రభాతవార్త :** హైదరాబాద్ జిల్లా కాంగ్రెస్ పార్టీ నూతన అధ్యక్షులు నియామక ప్రక్రియాకోసం ఎఐసిసి పరిశీలకులుగా వచ్చిన మహారాష్ట్ర ఉప సిఎల్‌పి నాయకులు, ఎమ్మెల్యే అమిన్ పటేల్‌ను బహదూర్‌పుర నియోజకవర్గానికి చెందిన టిపిసిసి కార్యదర్శి జి.కన్నయ్యలాల్ కలిశారు. పాతబస్తీలో కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేసే వారిని హైదరాబాద్ జిల్లా కాంగ్రెస్ కమిటి అధ్యక్షులుగా నియమించాలని పరిశీలకులు అమిన్ పటేల్‌ను కోరానని కన్నయ్యలాల్ తెలిపారు. పాతబస్తీకి చెందిన పలువురు కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.



మహారాష్ట్ర ఉప సిఎల్‌పి నాయకులు అమిన్ పటేల్‌ను కలిసిన టిపిసిసి కార్యదర్శి కన్నయ్యలాల్

### నవంబరు 7న డిమాండ్స్ డేగా రాష్ట్ర వ్యాప్త నిరసన ప్రదర్శనలు

**సైఫాబాద్, అక్టోబరు 13 ప్రభాతవార్త:** వైద్య రంగంలోని వివిధ సమస్యలు పరిష్కారం కోసం నవంబరు 7వ తేదీన 'డిమాండ్స్ డే'గా పాటిస్తూ రాష్ట్ర వ్యాప్తంగా అన్ని వైద్యశాలల ఎదుట నిరసన ప్రదర్శనలు నిర్వహించాలని తెలంగాణ మెడికల్ ఎంప్లాయీస్ యూనియన్ మహాసభ నిర్ణయించింది. ఈ మేరకు సోమవారం సత్యనారాయణరెడ్డి భవన్‌లో కొనసాగిన మహాసభ యూనియన్‌కు నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకుంది. రాష్ట్ర గౌరవ అధ్యక్షుడిగా సత్యనారాయణరెడ్డి, అధ్యక్షుడిగా ఎం.శ్రీనివాసమూర్తి, కార్యనిర్వాహక అధ్యక్షుడిగా ఎం.వేణుకుమార్, ప్రధాన కార్యదర్శిగా పి.ఇందిరా శ్రీలక్ష్మి, ఉప ప్రధాన కార్యదర్శులుగా శ్రీనివాసాచారి, ఎస్.శివానంద్, ఉపాధ్యక్షులుగా పి.నర్సయ్య, పి.స్వాతి, అమృతరావు, కవిత, వెంకటరావు, కార్యదర్శులుగా ఎం.మధుసూధనరెడ్డి, పి.సరస్వతి, ఎం.జగన్ మోహనరావు, పి.రామారావు, పి.కిషన్ ఎన్నికైనారు.

## 3న బిసిల రిజర్వేషన్‌ల కోసం 'చలో రాజ్‌భవన్'



సమావేశంలో మాట్లాడుతున్న యుగంధర్‌గౌడ్

**సైఫాబాద్, అక్టోబరు 13 ప్రభాతవార్త:** స్థానిక సంస్థల్లో బిసిలకు 42 శాతం రిజర్వేషన్‌లు దక్కకుండా అడ్డుపడుతున్న కేంద్ర ప్రభుత్వం, రాష్ట్ర గవర్నర్ వైఖరిని నిరసిస్తూ ఈ నెల 23న 'చలో రాజ్‌భవన్' ఆందోళన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని తెలంగాణ బిసి పొలిటికల్ జెఎసి రాష్ట్ర చైర్మన్ రాచాల యుగేంధర్‌గౌడ్ తెలిపారు. కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్‌లో బిసి రిజర్వేషన్‌లను 9వ షెడ్యూల్‌లో చేర్చితే ఏలాంటి న్యాయపరమైన అవరోధాలు ఉండేవి కావని, బిసి రిజర్వేషన్‌ల చట్టానికి గవర్నర్ అమోదం తెలిపిఉంటే హైకోర్టులో స్టే వచ్చేది కాదన్నారు. సోమవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాజ్యాంగ బద్దంగా విధులు నిర్వహించాల్సిన రాష్ట్ర గవర్నర్ ఇందుకు విరుద్ధంగా పనిచేస్తున్నారని, విధులను నిర్వహించడం చేతగాకపోతే తన పదవి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. మరొక వైపు బిసి రిజర్వేషన్‌లపై అన్ని రాజకీయ పార్టీలు డ్రామలు అడుతున్నాయని ఒక పార్టీ మీద మరొక పార్టీ నేపాలు వేయడం తప్ప బిసిలకు నిజమైన మద్దతు ఇవ్వడం లేదని ఆరోపించారు. 23న జరిగే చలో రాజ్‌భవన్ కార్యక్రమంలో అన్ని రాజకీయ పార్టీల్లోని బిసి నాయకులు పాల్గొని విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.

## అనుమతి లేకుండా కడుతున్న భవనం పనులు ఆపాలని కమిషనర్‌కు వినతి



హైదర్షాకోట్‌లో అనుమతి లేకుండా నిర్మిస్తున్న భవనం పనులు ఆపాలని కమీషనర్‌కు వినతిపత్రం ఇస్తున్న స్థానికులు

**నార్సింగి, అక్టోబర్ 13 ప్రభాతవార్త :** బండ్లగూడ జాగీర్ కార్పోరేషన్ పరిధిలోని హైదర్షాకోట్ అంబేద్కర్ భవనం ముందు అనుమతి లేకుండా కడుతున్న భవన నిర్మాణం పనులు ఆపాలని కోరుతూ స్థానికులు కమీషనర్ శరత్‌చంద్రకు వినతిపత్రంను అందజేశారు. ఈ సందర్భంగా దళిత పెద్దలు ప్రేమ్ కుమార్, లక్ష్మణ్, కట్ట విష్ణు, విజయ్ కుమార్, రాజు, సుదర్శన్‌లు మాట్లాడుతూ అంబేద్కర్ భవనం ముందు మున్సిపల్ అనుమతులు తీసుకోకుండా పంచాయతీ అనుమతితో ఎలాంటి సెట్‌బ్యాక్స్ లేకుండా భవనంను నిర్మిస్తున్నారని పేర్కొన్నారు. అనుమతి తీసుకొని కట్టుకోవాలని పేర్కొంటే నాకు రిజిస్ట్రేషన్ చేసిన దానిలో నేను కట్టుకుంటున్నాను, మీరు ఎక్కడైనా ఫిర్యాదు చేసుకోవచ్చని దబాయిస్తున్నాడని తెలిపారు. మేము ఇచ్చిన వినతిపత్రంను చదివిన కమీషనర్ శరత్‌చంద్ర స్పందిస్తూ అనుమతి లేకుండా కట్టే ఇళ్లన్నింటికి నోటీసులు ఇవ్వాలని, వెంటనే పనులు ఆపించాలని సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు. కమీషనర్ స్పందన పట్ల వినతిపత్రం ఇచ్చిన వారంతా సంతోషంను వ్యక్తం చేశారు.

### 17 నుండి 19 వరకు టిటిడీ దేవాలయంలో పవిత్రోత్సవాలు

**జూబ్లీహిల్స్, అక్టోబరు 13, ప్రభాతవార్త:** జూబ్లీహిల్స్‌లోని శ్రీ వెంకటేశ్వరస్వామి ఆలయంలో అక్టోబరు 17 నుండి 19 వరకు పవిత్రోత్సవాలను నిర్వహించనున్నారు. అక్టోబరు 16న ఆలయంలో అంకురార్పణ చేస్తారు. యాత్రికుల వల్ల, సిబ్బంది వల్ల తెలియక జరిగే దోషాల వల్ల ఆలయ పవిత్రతకు ఎలాంటి లోపం రానియకుండా నివారించేందుకు ఈ పవిత్రోత్సవాలను నిర్వహించడం ఆనవాయితీ అని ఆలయ వర్గాలు విడుదల చేసిన ఓ ప్రకటనలో తెలిపాయి. ఉత్సవాల్లో మొదటవి రోజున పవిత్ర ప్రతిష్ట, 18న పవిత్ర సమర్పణ, పవిత్ర హోమాలు, 19న మహాపూర్ణాహుతి, పవిత్ర విసర్జన జరుగుతుందన్నారు. ఉత్సవాల నేపథ్యంలో ప్రతి రోజు ఉదయం శ్రీదేవి, భూదేవి సమేత ప్రసన్న వెంకటేశ్వరస్వామి ఉత్సవాలకు తిరుమంజనం నిర్వహిస్తామన్నారు.

## గండిపేట మండలంలో బిఆర్ఎస్‌కు తిరుగులేదు : మాజీ మంత్రి సబితారెడ్డి

**నార్సింగి, అక్టోబర్ 13 ప్రభాతవార్త :** గండిపేట మండలంలో బిఆర్ఎస్ పార్టీకి తిరుగు లేదని, ఎన్నికలు ఎప్పుడు వచ్చినా బిఆర్ఎస్ భారీ మెజారిటీని సాధిస్తుందని మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే పి.సబతా ఇంద్రారెడ్డి పేర్కొన్నారు. సోమవారం నార్సింగి మున్సిపల్ బిఆర్ఎస్ అధ్యక్షులు విష్ణువర్ధన్‌రెడ్డి నాయకత్వంలో వంద మందికి పైగా ఎంఐఎం నాయకులు, కార్యకర్తలు కాంగ్రెస్ పార్టీలో చేరారు. వీరందరికి సబితారెడ్డి, కార్తిక్‌రెడ్డిలు గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా సబితారెడ్డి మాట్లాడుతూ మాజీ సీఎం కేసీఆర్ అమలు చేసిన సంక్షేమ పలాలు ప్రతీ ఇంటికి చేరాయని తెలిపారు. అసెంబ్లీ ఎన్నికల ముందు కాంగ్రెస్ అలవిగాని హామీలిచ్చి అధికారంలోకి వచ్చిందని ప్రజలందరూ తెలుసుకున్నారని, ఎప్పుడు ఎన్నికలు వచ్చినా కాంగ్రెస్‌కు గుణపాఠం చెప్పేందుకు సిద్దంగా ఉన్నారని తెలిపారు. నిరంకుశ, నియంతృత్వ, మోసపూరిత, కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్న కాంగ్రెస్ పాలకులకు పతనం ప్రారంభమైందన్నారు. స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహిస్తే బిఆర్ఎస్ సత్తా ఏమిటో అధికార కాంగ్రెస్ పార్టీకి తెలిసి వచ్చేదన్నారు. పాత, కొత్త నాయకులంతా సమన్వయంతో పని చేసి బిఆర్ఎస్‌ను బలోపేతం చేయాలని సూచించారు. బిఆర్ఎస్‌లో చేరిన ఎంఐఎం నాయకులు, కార్యకర్తలు మహ్మద్ హాజీక్, ఖాజాపాషా, ఆనీసాబేగం, అల్ నాజర్ ఖాన్, ఖయ్యూం, సమద్‌ఖాన్, అమీర్‌ఖాన్, మహ్మద్ అహ్మద్, ఫరీదాబేగం, సల్మాబేగం, షమీమ్ బేగం, షాహె తదిరులు ఉనాననరు. ఈ సమావేశంలో బిఆర్ఎస్ నాయకులు షేక్ ముక్తార్ పాషా, ముత్యాలు, గణేష్‌రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, గబ్బర్‌సింగ్, సంతోష్, చిరంజీవి, మల్లేష్, మహిపాల్ తదితరులు పాల్గొన్నారు.



ఎంఐఎం నుంచి బిఆర్ఎస్‌లో చేరిన వారికి గులాబీ కండువాలు కప్పిన మాజీ మంత్రి సబితారెడ్డి దృశ్యం.

## కాంగ్రెస్ కమిటీ జిల్లా అధ్యక్షుడి ఎన్నికపై కసరత్తు

**హైదరాబాద్, అక్టోబరు 13 ప్రభాతవార్త:** సంస్థాగత ఎన్నికల నేపథ్యంలో ఏఐసిసి ఇచ్చిన పిలుపు మేరకు 'సంఘటన్ సృజన్ అభియాన్' కార్యక్రమం జరిగింది. సోమవారం అంబర్‌పేటలో జరిగిన ఈ సమావేశంలో ఖైరతాబాద్ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడి ఎన్నికపై కసరత్తు జరిగింది. జిల్లా అధ్యక్షుడు సి.రోహిన్ రెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఏఐసీసీ పరిశీలకుడు, పార్లమెంటు సభ్యుడు శక్తి సింగ్ గోహిల్, పిసిసి పరిశీలకుడు, పార్లమెంటు సభ్యుడు మల్లు రవి, పాలకుర్తి ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి, పార్టీ పరిశీలకుడు సంగమేశ్వర్, సీతారాములు, పిసిసి కోఆర్డినేటర్ చంద్రశేఖర్, మాజీ ఎంపి వి.హనుమంతరావు, టీపీసీసీ ఉపాధ్యక్షులు నవాబ్ ముజాహిద్ అలంఖాన్, పార్టీ సీనియర్ నాయకులు ఆర్.లక్ష్మణ్‌యాదవ్, మాజీ కార్పొరేటర్లు పి.నారాయణస్వామి, పులి జగన్, దిడ్డి రాంబాబు, పిసిసి మాజీ కార్యదర్శి లక్పతి యాదగిరిగౌడ్, పిసిసి కార్యదర్శి శంభుల శ్రీకాంత్ గౌడ్, సత్యంగౌడ్, ఖైరతాబాద్ జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు శంభుల ఉషశ్రీ శ్రీకాంత్‌గౌడ్, పార్టీ సీనియర్ నాయకులు గరిగంటి రమేష్, మోత రోహిత్, పి.రామ్మోహన్‌రావు, జె.సత్తిబాబు గౌడ్, గడ్డం శ్రీధర్‌గౌడ్ ,కుంకుమ రాజేశ్వర్ రావు, హారీతిలక్ సింగ్ ,కోటం అనిల్‌కుమార్ ,షేక్ జామీర్, ఎండీ ఫరీద్ ,తొలుపునూరి కృష్ణా గౌడ్ , పి.వెంకటేశ్‌గౌడ్, డి.కిషోర్, సి.సుధాకర్, శశిధర్‌గౌడ్ ,ఆర్.సుధాకర్ ,లక్ష్మణ్, రవి, శ్రీకర్, విజిత రెడ్డి, సునీతరెడ్డి, లావణ్య, శాంతమ్మ , సునిల్‌గౌడ్, భరత్, రాజ కిరణ్, సందీప్‌గౌడ్, సమద్, అలీం, సర్ఫరాజ్, జహంగీర్, శ్రీనివాస రెడ్డి, కిరణ్ ఇతర ముఖ్య నాయకులు, డివిజన్ ప్రెసిడెంట్లు, మహిళా కాంగ్రెస్ నాయకులు, యూత్ కాంగ్రెస్, బ్లాక్ కాంగ్రెస్, ఎన్ఎస్‌యుఐ నాయకులు పాల్గొన్నారు.




'సంఘటన్ సృజన్ అభియాన్'లో మాట్లాడుతున్న ఎంపి శక్తిసింగ్ గోహిల్, చిత్రంలో ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి, డిసిసి అధ్యక్షుడు డాక్టర్ సి.రోహిన్ రెడ్డి, టీపీసీసీ ఉపాధ్యక్షులు నవాబ్ ముజాహిద్ అలంఖాన్ తదితరులు

## సాహిత్య సాంస్కృతిక విలువలు పెంచడానికి సంస్థల కృషి ప్రశంసనీయం : వాసు రావు

**చిక్కడపల్లి, అక్టోబరు 13 ప్రభాతవార్త:** నేటి సమాజానికి అనుగుణంగా సాహిత్య సాంస్కృతిక విలువలు పెంచడానికి సంస్థలు చేస్తున్న సేవలు ప్రశంసనీయమని ప్రముఖ సంగీత దర్శకులు సాలూరి వాసు రావు అన్నారు. సోమవారం సాహిత్య సంగీత సాంస్కృతిక సమన్వయ సంస్థ ఆధ్వర్యంలో సాహిత్య సంగీత కార్యక్రమం ప్రముఖ కవి, భూగర్భ గనుల శాఖ పూర్వ డైరెక్టర్ డాక్టర్ వి.డి. రాజగోపాల్ అధ్యక్షతన జరిగింది. ముఖ్యఅతిథిగా హాజరైన సాలూరి వాసు రావు మాట్లాడుతూ సాహితీ విలువలు పెంచడానికి కవులు, కళాకారులను పోషించడం ఎంతో విశేషమని పేర్కొన్నారు. ఈ సందర్భంగా మహర్షి వాల్మీకి, మహాత్మ గాంధి లాల్ బహదూర్ శాస్త్రి, గుర్రం జాషువ, సాలూరి రాజేశ్వర రావు లను స్మరించుకుంటూ కవిసమ్మేళనం, గద్వాల సోమన్న రచించిన "మిఠాయి పొట్లం" పుస్తక ఆవిష్కరణ జరిగింది. కార్యక్రమంలో పాత్రికేయులు స్వప్న, ప్రముఖ కవయిత్రి మంగిపూడి రాధిక, కిన్నెర సంస్థ ప్రతినిధి రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు. డాక్టర్ వి.డి.రాజగోపాల్ , ఎం సిద్ధారెడ్డి, ఎ.ఎల్.కృష్ణారెడ్డి డాక్టర్ ఎన్ వెంకటరమణ, పి. బయ్యపు రెడ్డి, ఎ.వి. సుబ్రహ్మణ్యం, విజయరామరాజు, డాక్టర్ ఉషా రాణి, ఎన్ విజయలక్ష్మి కార్యక్రమం నిర్వహణకు తోడ్పాటు అందించారు. రవీంద్ర బాబు అరవా నిర్వహణలో కవిసమ్మేళనం జరగ్గా, స్వర సమ్రాట్ డా.శరత్ చంద్ర బృందం వారి సంగీత కార్యక్రమం అద్భుతంగా సాగింది.



కార్యక్రమంలో పాల్గొన్న ప్రముఖ సంగీత దర్శకులు సాలూరి వాసు రావు, భుగర్భగనుల శాఖ పూర్వ డైరెక్టర్ డాక్టర్ విడి.రాజగోపాల్ తదితరులు

### సమాచార హక్కు చట్టం-2005 పై అవగాహన



**అత్తాపూర్ అక్టోబరు13, ప్రభాతవార్త :** ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణా వ్యవసాయ విశ్వవిద్యాలయంలో సోమవారం సమాచార హక్కు చట్టం 2005 పై అవగాహన దినోత్సవం జరిగింది. వర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ విద్యాసాగర్ ఆన్ లైన్ విధానంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. విశ్వ విద్యాలయ అధికారులు, కంప్ట్రోలర్ శ్రీనివాసరావు, జాయింట్ రిజిస్ట్రార్ డి.శివాజి, వర్సిటీ పరిధిలోని కళాశాలల అసోసియేట్ డీన్స్, పరిశోధనా స్థానాల అధిపతులు, అసోసియేట్ డైరెక్టర్స్ ఆఫ్ రీసెర్చ్, కృషి విజ్ఞాన కేంద్రాల సమన్వయ కర్తలు పాల్గొన్నారు. సమాచార హక్కు చట్టం అమలు గురించి రిజిస్ట్రార్ విద్యాసాగర్, కంప్ట్రోలర్ శ్రీనివాసరావులు వివరించారు. సమాచార చట్టం అమలు పై రాష్ట్ర ప్రభుత్వం, రాష్ట్ర ఉన్నత విద్యామండలి నిరంతరం సమీక్ష చేస్తున్నాయని విద్యాసాగర్ తెలిపారు. ప్రతి అధికారి ఈ చట్టం పై పూర్తి అవగాహన కల్పించుకోవాలని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమాన్ని వర్సిటీ పౌర సంబంధాల అధికారి డాక్టర్ వి. సుధాకర్, సహాయ పౌర సంబంధాల అధికారి టి. మార్ష్బ బాబు లు సమన్వయం చేసారు.

## ఓటు చోరీ సంతకాలు సేకరణ




సమావేశంలో పాల్గొన్న నేతలు

**అల్వాల్, అక్టోబరు 13 ప్రభాతవార్త:** ఓటు చోరీ సంతకాలు సేకరణపై సోమవారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో సమావేశం జరిగింది. అల్వాల్‌లో జరిగిన సమావేశానికి మూడు డివిజన్లకు చెందిన నేతలు, కార్యకర్తలు హాజరయ్యారు. ఎన్డీఏ ప్రభుత్వం ఓట్లు దొంగతనం చేయడం ద్వారా దేశంలో ఎలా గెలుస్తుందనే దానిపై ప్రజలకు అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని సర్కిల్ పార్టీ అధ్యక్షుడు అశోక్ రెడ్డి తెలిపారు. బూతులు వారీగా ప్రతి ఇంటికి వెళ్ళాలని ఆయన కార్యకర్తలను కోరారు. ఓటరు జాబితాలో ఫొటోలు, పేర్లను పరిశీలించాలని పేర్కొన్నారు. జాబితాను ఎన్నికల కమీషనర్ బహిరంగంగా విడుదల చేయాలని ఆయన డిమాండ్ చేశారు. సంతకాలు సేకరణను పకడ్బందీగా చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో అల్వాల్, వెంకటాపురం డివిజన్ల అధ్యక్షులు ఉదయ్ కుమార్, భాస్కర్ నేతలు సూర్యకిరణ్, నాగేశ్వరరావు, శ్రీనివాస్ గౌడ్, వీసస్ మేరీ, బబిత, పద్మ, గాయత్రి తదితరులు పాల్గొన్నారు.

## బిసిలకు అన్యాయం..తప్పదిక పోరాటం

**బిసి ఐక్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌యాదవ్ పిలుపు**



బీసీ ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షులు బేరి రామచందర్‌యాదవ్

**శేరిలింగంపల్లి, అక్టోబర్ 13 ప్రభాతవార్త** బీసీ రిజర్వేషన్లపై హైకోర్టు స్టే విధించటంతో బీసీలకు తీరని అన్యాయం జరిగిందని బీసీ ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షులు బేరి రామచందర్ ఆవేదన వ్యక్తం చేశారు. బీసీ సంఘం అధినేత ఆర్. కృష్ణయ్య పిలుపుమేరకు ఈనెల 14వ తేదిన రాష్ట్ర బంద్‌ను విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా భేరి రామచందర్‌యాదవ్ మాట్లాడుతూ.. బీసీలందరూ ఒకరికొకరు చేతులు కలుపుకుని బీసీల రాజ్యాధికారం కోపం పోరాటం చేయటం తప్పదని అన్నారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని, తద్వారా బీసీలకు రాజ్యాధికారం రావాలన్నారు. ఈ నేపధ్యంలో 14వ తేదిన జరిగే రాష్ట్ర బందును విజయవంతం చేసి ప్రభుత్వానికి బీసీ ఐక్యతను చాటుకోవాలని బీసీ సంఘాల నాయకులు డాక్టర్ అరుణ్ కుమార్; సీనియర్ బీసీ నాయకులు రామస్వామియాదవ్, కంటెస్టెడ్ ఎమ్మెల్యే ఒంగూరి శ్రీనివాస్ యాదవ్, బీసీ సంఘాల నాయకులు పిలుపునిచ్చారు.

## ఆంజనేయస్వామి దేవాలయం హుండీ ఆదాయం రూ.లక్ష 17వేల 599

**చిక్కడపల్లి, అక్టోబరు 13 ప్రభాతవార్త:** వివేక్ నగర్ ఆంజనేయస్వామిదేవాలయంలో సోమవారం హుండీ లెక్కింపు జరిగింది. ఆలయం పునర్ నిర్మాణ కమిటీ చైర్మన్ సుధాకర్, ఈవో మాచర్ల దేవనాథం, దేవాదాయ ధర్మాదాయ శాఖ ఇన్స్పెక్టర్ సురేఖ పర్యవేక్షణలో లెక్కించారు. 38 రోజు లకు గాను రూ.లక్ష17వేల 599 ఆదాయం వచ్చింది. దేవాలయంలో అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధాన అర్చకులు బుగ్గా లక్ష్మీపతిశర్మ, కందాళ వెంకటాద్రి భక్తులు పాల్గొన్నారు.

## మద్యం మత్తులో కానిస్టేబుల్ హల్‌చల్

**శేరిలింగంపల్లి, అక్టోబర్ 13 ప్రభాతవార్త** మద్యం సేవించి ఓ కానిస్టేబుల్ హల్‌చల్ చేసిన సంఘటన చందానగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. మియాపూర్ పోలీస్‌స్టేషన్‌లో కోర్టు కానిస్టేబుల్‌గా విదులు నిర్వహిస్తున్న యం.రాఘవేందర్ చందానగర్ జాతీయ రహదారిపై మద్యం సేవించి కారు నడుపుతూ మరో కారుని ఢీకొట్టాడు. అంతటితో ఆగకుండా సదరు వాహనదారులతో దుర్భాషలాడుతూ వారిపై దురుసుగా ప్రవర్తించాడు. మద్యంమత్తులో ఉండటంతో పోలీసునంటూ బెదిరించాడు. అటుగా వెళ్తున్న వాహనదారులు రాఘవేందర్‌ను అడ్డుకుని స్థానిక పోలీసులకు అప్పగించినట్లు సమాచారం.

## త్వరలో లక్ష మందితో క్షత్రియ రాజ్‌పుత్‌ల బహిరంగ సభ : ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్

**హైదరాబాద్, అక్టోబరు 13 ప్రభాతవార్త:** లక్షమందితో త్వరలో క్షత్రియ రాజ్‌పుత్‌లతో భారీ బహిరంగ సభను ఏర్పాటు చేయనున్నట్టు రామగుండం ఎమ్మెల్యే మక్కన్‌సింగ్ అన్నారు. సోమవారం అంబర్‌పేటలోని మహారాణ ప్రతాప్ ఫంక్షన్ హాల్‌లో రాజ్‌పుత్ క్షత్రియ సమాజ్ దసరా సమ్మేళన కార్యక్రమాన్ని ఘనంగా జరుపుకున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే పాల్గొని మాట్లాడుతూ క్షత్రియుల సమస్యల పరిష్కారం కోసం రాజధానిలో భారీ బహిరంగ సభను నిర్వహించనున్నట్టు తెలిపారు. అంతేగాకుండా రాష్ట్ర ప్రభుత్వం క్షత్రియ సమాజం కోసం ప్రత్యేక కార్పొరేషన్‌ను ఏర్పాటు చేసే దిశగా కృషి చేస్తానని పేర్కొన్నారు. సమాజంలోని పేద బడుగు బలహీన వర్గాల ప్రజల ఆర్థిక అభివృద్ధికి అందరూ సంఘటిత సహకారం అందించాలని కోరారు. మారుతున్న శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానాన్ని కనుగుణంగా క్షత్రియ సమాజంలోని యువతి, యువకులు ఆయా రంగాల్లో రాణించాలని సూచించారు. అనంతరం 10వ తరగతి, ఇంటర్, బీటెక్ తదితర విద్యలో రాణించిన ప్రతిభావంతుల విద్యార్థినీ, విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లతో పాటు ప్రశంసా పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో క్షత్రియు రాజ్‌పుత్ సభా అధ్యక్షుడు ఠాకూర్ జైవీర్ సింగ్, ఉపాధ్యక్షులు మహేందర్ ప్రతాప్‌సింగ్, సెక్రటరీ ఠాకూర్ అరుణ్‌సింగ్, జనరల్ సెక్రటరీలు ఠాకూర్ సంతోష్‌సింగ్, ఠాకూర్ భవానీసింగ్, మురళి మోహన్‌సింగ్, ఆర్గనైజర్ సెక్రటరీలు ఠాకూర్ సునితాదేవి, ఠాకూర్ సుధీర్‌సింగ్, గణేష్ ప్రసాద్‌సింగ్, ఠాకూర్ నర్సింగ్ భాన్‌సింగ్, ట్రెజరర్ ఠాకూర్ నరేందర్‌సింగ్, అడ్వకేట్ ఠాకూర్ జస్వంత్‌సింగ్ అడ్వకేట్ ఠాకూర్ శివ్ చరణ్‌సింగ్, ట్రెజరర్ ఠాకూర్ నరేందర్‌సింగ్, ఎల్ రాంప్రతాప్‌సింగ్, ఠాకూర్ ప్రేమ్‌సింగ్, పుష్పరాజ్ సింగ్ బయ్యాస్, అడ్వకేట్ ఠాకూర్ జస్వంత్‌సింగ్, ఠాకూర్ మనోహర్‌సింగ్, ఠాకూర్ భరత్‌సింగ్, సీజే సంపత్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.



అంబర్‌పేట మహారాణ ప్రతాప్ ఫంక్షన్‌హాల్‌లో రాజ్‌పుత్ క్షత్రియ సమాజ్ దసరా సమ్మేళనంలో పాల్గొన్న రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ తదితరులు

## సిఎస్ఐఆర్ఐఐసిటిలో అంతర్జాతీయ సదస్సు

**తార్నాక, అక్టోబర్ 11 ప్రభాతవార్త :** సిఎస్ఐఆర్-ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కెమికల్ టెక్నాలజీ (ఐఐసిటి) ఆధ్వర్యంలో ఫ్రంటియర్స్ ఇన్ సస్టైనబుల్ ఆర్గానిక్ సింథసిస్ అండ్ కెమికల్ బయాలజీ అనే పేరుతో అంతర్జాతీయ సదస్సు సోమవారం తార్నాక క్యాంపస్‌లో ఘనంగా ప్రారంభమైంది. ప్రపంచవ్యాప్తంగా ఉన్న ప్రముఖ శాస్త్రవేత్తలు, విద్యావేత్తలు, పరిశ్రమ నిపుణులు ఈ సదస్సులో పాల్గొని సస్టైనబుల్ కెమిస్ట్రీ, కెమికల్ బయాలజీ రంగాలలో తాజా అభివృద్ధులు, ఆవిష్కరణలపై చర్చించారు. సిఎస్ఐఆర్ ఉన్నతాధికారులు, ప్రఖ్యాత విద్యావేత్తల సమక్షంలో సదస్సును డైరెక్టర్ డాక్టర్ డి. శ్రీనివాస్ రెడ్డి అధ్యక్షతన ప్రారంభించారు. ఈ సదస్సు ప్రధాన అంశం సస్టైనబుల్ ఆర్గానిక్ సింథసిస్, కెమికల్ బయాలజీపై దృష్టి సారించింది. గ్రీన్ కెమిస్ట్రీ, కాటలిసిస్, అసిమెట్రిక్ సింథసిస్, నేచురల్ ప్రొడక్ట్ ఆధారిత పరివర్తనల వంటి అంశాలపై ప్రత్యేక చర్చలు జరుగుతున్నాయి .ప్రపంచ ప్రఖ్యాత ఆర్గానిక్ కెమిస్టు ప్రొ. ఫిల్ ఎస్. బారన్ తొలిసారిగా భారతదేశంలో తన శాస్త్రీయ ఉపన్యాసం ఇవ్వడం ఈ సదస్సు ముఖ్య ఆకర్షణగా నిలిచింది. జర్మనీ, అమెరికా, సింగపూర్, ఫ్రాన్స్‌ల నుంచి ప్రముఖ శాస్త్రవేత్తలు కూడా పాల్గొనడం వలన ఈ కార్యక్రమం అంతర్జాతీయ స్థాయి శాస్త్రీయ వేదికగా మారింది. సదస్సు కన్వీనర్ డాక్టర్ చి. రాజి రెడ్డి, సిఎస్ఐఆర్ఐఐసిటి చీఫ్ సైంటిస్ట్, పరిశ్రమల నుండి లభించిన సహకారం పట్ల కృతజ్ఞతలు తెలిపారు. సదస్సు విద్యా, పరిశ్రమ రంగాల నిపుణులను ఒకే వేదికపైకి తీసుకువచ్చి, సస్టైనబుల్ కెమిస్ట్రీలో ఆవిష్కరణలు, ఆలోచనల మార్పిడి, పర్యావరణానికి అనుకూలమైన ఔషధ, పదార్థ, రసాయన శాస్త్ర అభివృద్ధులకు దారితీసే లక్ష్యంతో నిర్వహించబడుతోందని శాస్త్రవేత్తలు పేర్కొన్నారు.



సావనీర్‌ను ఆవిష్కరిస్తున్న శాస్త్రవేత్తలు

### ఏకగ్రీవంగా ఎంపికైన భవానీ కాలనీ నూతన కార్యవర్గం



భవాని కాలనీ రెసిడెన్షియల్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కార్యవర్గం ప్రతినిధుల దృశ్యం

**నార్సింగి, అక్టోబర్ 13 ప్రభాతవార్త :** బండ్లగూడ జాగీర్ కార్పోరేషన్ పరిధిలోని భవానీ కాలనీ రెసిడెన్షియల్ అసోసియేషన్ నూతన కార్యవర్గం సోమవారం ఏకగ్రీంగా ఎంపికయ్యింది. అధ్యక్షులుగా జయరాజ్, ఉపాధ్యక్షులుగా మహేష్, ప్రధాన కార్యదర్శిగా వెంకటేష్, సంయుక్త కార్యదర్శిగా కిరణ్, కోశాధికారిగా పవన్ కుమార్, మహిళా విభాగం ప్రతినిధిగా మంగా తదితరులు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షులు జయరాజ్ మాట్లాడుతూ పోటీ లేకుండా స్నేహపూరితంగా ఏకగ్రీవంగా మమ్ములను ఎంపిక చేసుకున్న కాలనీ వాసులందరికి ధన్యావాదాలు తెలుపుకుంటున్నామన్నారు. కాలనీ అభివృద్దికి, శుభ్రత, భద్రతల కోసం ప్రణాళిక బద్దంగా పని చేస్తామన్నారు. కాలనీ సభ్యుల సలహాలు, సూచనలు తీసుకున్న తరువాతనే మా కమిటీ ముందడుగు వేస్తుందన్నారు. అందరిని కలుపుకొని, అందరి సమస్యల పరిష్కారం కోసం పని చేస్తామని స్పష్టం చేశారు

### రిటర్నింగ్ కార్యాలయాన్ని సందర్శించిన జిల్లా ఎన్నికల అధికారి

**జూబ్లీహిల్స్, అక్టోబరు 13, ప్రభాతవార్త:** బంజారాహిల్స్‌లోని షేక్‌పేట మండల కార్యాలయంలో ఉన్న జూబ్లీహిల్స్ అసెంబ్లీ ఉప ఎన్నికలకు సంబంధించిన రిటర్నింగ్ కార్యాలయాన్ని సోమవారం ఉదయం జిల్లా ఎన్నికల అధికారి ఆర్‌వి కర్ణన్ సందర్శించారు. అక్కడున్న ఆర్‌ఓ, ఏఆర్‌ఓలతో పనులను సమీక్షించారు. నామినేషన్ల ప్రక్రియ సజావుగా జరిగేలా ఈసీఐ నిబంధనలకు లోబడి అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తిచేసి నామినేషన్ల స్వీకరణ సర్వసన్నద్ధంగా ఉండాలని రిటర్నింగ్ అధికారి పి. సాయిరాంకు సూచించారు.

## ఫహీం ఖురేషీని కలిసిన నవీన్‌యాదవ్

**జూబ్లీహిల్స్, అక్టోబరు 13, ప్రభాతవార్త:** జూబ్లీహిల్స్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నవీన యాదవ్ సోమవారం తెలంగాణ రాష్ట్ర మైనార్టీస్ రెసిడెన్షియల్ ఎడ్యుకేషనల్ ఇనిస్టిట్యూషన్స్ సొసైటి (టీఎంఆర్ఈఐఎస్) ఉపాధ్యక్షుడు ఫహీం ఖురేషీని మర్యాదపూర్వకంగా కలిశారు. రాష్ట్రంలోని మైనార్టీ విద్యాభివృద్ధి, యువతకు అవకాశాల విస్తరణ, నియోజకవర్గంలో మైనార్టీ విద్యార్థుల కోసం చేపట్టాల్సిన కార్యక్రమాలపై చర్చించారు. ప్రజా సేవా ధ్యేయంతో ముందుకు సాగాలని ఈ సందర్భంగా ఖురేషీ సూచించారు.



ఫహీం ఖురేషీని కలిసిన నవీన్‌యాదవ్

### ప్రభుత్వ పాఠశాలలో మౌలిక సదుపాయాల కల్పనకు చేయూత

**చిక్కడపల్లి, అక్టోబరు 13 ప్రభాతవార్త:** మార్కండేయ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సోమవారం ప్రభుత్వ పాఠశాలలో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రత్యేక దృష్టిని కేంద్రీకరించడంతో పాటు రూపురేఖలు మార్చడం జరిగిందని ఫౌండేషన్ వ్యవస్థాపకులు ఆకినేపల్లి శ్రీదేవి, ఆకినేపల్లి కిషోర్ వివరించారు. పలు ప్రాంతాలలో పాఠశాలలను అభివృధి చేశామన్నారు. ఇందులో భాగంగా నగరంలోని మూసాపేట్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పన్నెండు మరుగుదొడ్ల నిర్మాణం, నూతన మంచినీటి కనెక్షన్ ఏర్పాటు, గ్రంథాలయం పునరుద్ధరణ, విద్యుత్ వ్యవస్థ ఆధునీకరణ వంటి పనులను చేపట్టడం జరిగిందన్నారు. నూతనంగా మౌలిక సదుపాయాలు పూర్తి చేయడం వల్ల మంచి విద్యార్థిని విద్యార్థులకు, ఉపాధ్యాయులు మంచి వాతావరణం తీర్చిదిద్దడం జరిగిందన్నారు.

### ది ఇండియన్ సమ్మిట్-2025కు హాజరైన గోనె సాల్మన్‌రాజ్



ది ఇండియన్ సమ్మిట్‌లో పాల్గొన్న తెలంగాణ యూనైటెడ్ క్రిస్టియన్ పాస్టర్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి దక్షిణభారత ఐఎంసిసి కమిషన్ సభ్యుడు గోనె సాల్మన్‌రాజ్ తదితరులు

**చిక్కడపల్లి, అక్టోబరు 13 ప్రభాతవార్త:** నాగాలాండ్ రాష్ట్రంలో దిమాపూర్‌లో జరుగుతున్న ది ఇండియన్ సమ్మిట్-2025లో తెలంగాణ యూనైటెడ్ క్రిస్టియన్ పాస్టర్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి దక్షిణభారత ఐఎంసిసి కమిషన్ సభ్యుడు గోనె సాల్మన్‌రాజ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆ రాష్ట్ర నీఫియు రియోతో సమావేశమై పలు అంశాలపై చర్చించారు. కార్యక్రమంలో బాప్టిస్ట్ వరల్డ్ అలయన్స్ జనరల్ సెక్రటరీ రెవరెండ్ డాక్టర్ ఎలిజా లీ బ్రౌన్, ఐఎంసిసి ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ రెవరెండ్ సమరేష్ నాయక్, ఆసియా పసిఫిక్ బాప్టిస్ట్ ఫెడరేషన్ జనరల్ సెక్రటరీ రెవరెండ్ డాక్టర్ వీ టెట్సియో, అమెరికన్ బాప్టిస్ట్ ఇంటర్నేషనల్ మినిస్ట్రీస్ ఏరియా డైరెక్టర్ రెవరెండ్ డాక్టర్ బెక్కి షెంటన్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆ రాష్ట్రంలోని దిమాపూర్ ఎన్‌బిసిసి వాలంటీర్లు కోహిమా అతిధిగృహం, గెస్ట్ హౌస్, ముఖ్యమంత్రి నివాసం, నాగాలాండ్ అసెంబ్లీ హాల్, కేథడ్రల్, రెండవ ప్రపంచ యుద్ధ స్మశానవాటిక, హెరిటేజ్ విలేజ్ చిజామి సందర్శించారు ఇక్కడ మా మొదటి పాస్టర్ రెవరెండ్ డాక్టర్ శామ్యూల్ మామ 1968లో మిషనరీగా పనిచేశారని సాల్మన్‌రాజ్ తెలిపారు.

### మానవ హక్కుల కమిషన్ కార్యాలయంలో ఫిర్యాదు




ఎపిటొమ్ సంస్థపై పిర్యాదు చేసిన బాధితులు

**అఫ్జల్‌గంజ్, అక్టోబర్ 13ప్రభాతవార్త:** యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలం, దేవులమ్మనాగరం తంగడపల్లి గ్రామాల్లో ఎపిటొమ్ ఇంటిగ్రేటెడ్ సిటి పేరిట జరుగుతున్న అక్రమ రియల్ ఏస్టేట్ కార్యకలాపాలపై నిరసన గళం విప్పారు. సోమవారం నాంపల్లిలోని రాష్ట్ర మానవ కమీషన్‌ను ఆశ్రయించి, రైతులకు జరిగిన అన్యాయం పైన లిఖిత పూర్వకంగా ఆధారాలతో పత్రాలను, హెచ్‌ఆర్‌సి కార్యాలయంలో హెచ్‌ఆర్‌సి చైర్మన్ షమీం అక్తర్‌ను కలిసి ఫిర్యాదు చేసి విన్నవించారు. బాధితులు మాట్లాడుతూ ఎపిటొమ్ సంస్థకు కేవలం 367 ఎకరాలకు మాత్రమే అనుమతి ఉందన్నారు. దానికి 1200 ఎకరాలకు విస్తరించి చట్ట విరుద్ధంగా భూములను అక్రమించిందని వారు ఆరోపించారు. పోలాలకు, వెళ్లే నక్ష బాటలు, కుంటలు, చెవరువులు కూడా విక్రయించి ప్లాట్లు విక్రయిస్తుందన్నారు..2021 ప్రారంభమై ఈ ప్రాజెక్టు 2024లో పూర్తవుతుం దని చెప్పి ఇంకా పూర్తి చేయలేదన్నారు. కొంత మంది అప్పటి అధికార పార్టీ పెద్దలు, ఇప్పటి అధికార పార్టీ పెద్దలు ఉన్నట్లు బాధితులు, రైతులు ఆరోపించారు. రిజిస్ట్రేషన్ కోసం చెల్లించిన డబ్బులు ఇవ్వకుండా రోటేషన్ బిజినెస్ చేస్తుందని వారు తీవ్రంగా స్థాయిలో మండిపడ్డారు.



ఆత్మహత్యకు పాల్పడిన బిజెవైఎం నేత రెవల్లి రాజు కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ, బూర నర్సయ్యగౌడ్ తదితరులు

# మల్కాజిగిరి సర్కిల్‌లో అధికారుల నిర్లక్ష్యం... లైన్‌మెన్ల ఇష్టారాజ్యం!

-రోడ్ కటింగ్ చార్జీలకు భారీగా గండి
- వ్యక్తిగత లావాదేవీలతో అడ్డగోలుగా రోడ్డు తవ్వకాలు
-మల్కాజిగిరి సర్కిల్లో అధ్వానంగా మారిన రోడ్లు
- అక్రమ కనెక్షన్ల వెనుక అధికారుల పర్యవేక్షణ లోపంపై స్థానికుల ఆగ్రహం



**నేరెడ్ మెట్, అక్టోబర్ 13,ప్రభాతవార్త.**
మల్కాజిగిరి సర్కిల్ ఇంజనీరింగ్ విభాగంలో ఉన్నతాధికారుల నిర్లక్ష్యం, కిందిస్థాయి సిబ్బంది పర్యవేక్షణ లోపం కారణంగా మల్కాజిగిరి సర్కిల్ పరిధిలోని పలు కాలనీల్లో రోడ్లు అధ్వానంగా మారడంతో ప్రజలు నానా ఇక్కట్లకు గురవుతున్నారు. వాటర్ బోర్డు లైన్మెన్లు నిబంధనలకు విరుద్ధంగా, అనధికారికంగా రోడ్డు తవ్వకాలకు పాల్పడి ప్రభుత్వ ఖజానాకు భారీగా నష్టం కలిగిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. చట్టబద్ధమైన ఖీరోడ్ కటింగ్ చార్జీలుఖీ చెల్లించకుండానే, లైన్మెన్లతో వ్యక్తిగత లావాదేవీలు జరిపి నీటి కనెక్షన్లు ఇస్తున్నారని, దీనివల్ల ప్రజల సొమ్ముతో వేసిన రోడ్లు ధ్వంసమవుతున్నాయని వాహనదారులు, కాలనీవాసులు మండిపడుతున్నారు. సాధారణంగా మంచినీటి నల్ల కనెక్షన్ కోసం వాటర్ బోర్డుకు దరఖాస్తు చేసుకునే వినియోగదారులు, నిబంధనల ప్రకారం ఇంజనీరింగ్ అధికారులకు నిర్ణీత రోడ్ కటింగ్ చార్జీలు చెల్లించిన తరువాతే అధికారికంగా అనుమతి పొందాలి. ఈ చార్జీలు ప్రభుత్వ ఖజానాకు చేరుతాయి. అయితే ఈ ప్రక్రియను లైన్మెన్లు పూర్తిగా పక్కన పెడుతున్నారు. ఉన్నతాధికారుల కళ్లుగప్పి, కిందిస్థాయి సిబ్బంది వ్యక్తిగత లావాదేవీలతో రోడ్లను విచ్ఛిన్నం చేసి అక్రమంగా కనెక్షన్లు ఇస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. మల్కాజిగిరి సర్కిల్లోని వినాయక్ నగర్, గౌతమ్ నగర్, మోలాలి, సైనిక్ నగర్, న్యూ విద్యానగర్, నేరేడ్మెట్, కాకతీయ నగర్, అంతయ్య కాలనీ, చంద్రగిరి కాలనీ, రామబ్రహ్మం నగర్, మిర్యాలగూడ కాలనీతో పాటు పలు కాలనీల్లోని రోడ్లను విచ్చల విడిగా తవ్వకాలు జరుపుతున్నారు. దీంతో కొత్తగా వేసిన రోడ్లు కూడా కొన్ని రోజుల్లోనే కంకర తేలి, గుంతలమయంగా మారుతున్నాయి. రోడ్ కటింగ్ చార్జీలు ప్రభుత్వ ఖజానాకు చేరకుండానే కిందిస్థాయి సిబ్బంది దండుకోవడం, ఉన్నతాధికారులు చూసీ చూడనట్టు వ్యవహరించడం దారుణమని కాలనీవాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రోడ్ల తవ్వకాల్లోని అక్రమాల వల్ల ప్రజల సొమ్ముతో వేసిన రోడ్లు ధ్వంసమవుతున్నాయి. వాహనదారులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నా అధికారులు పట్టించుకోవటం లేదని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతూ, ప్రజల సౌకర్యానికి అడ్డుగా మారుతున్న ఈ అక్రమాలకు తక్షణం అడ్డుకట్ట వేయాలని, లైన్మెన్ల చేతివాటం వెనుక ఉన్న అధికారుల నిర్లక్ష్యాన్ని బహిర్గతం చేసి వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కాలనీవాసులు డిమాండ్ చేస్తున్నారు.

## హనుమాన్ దేవాలయంలో భక్తిరసధార ప్రవచనం



**నేరెడ్ మెట్, అక్టోబర్ 13,ప్రభాతవార్త**
నెరెడ్‌మెట్ డివిజన్‌లోని ఆర్‌కేపురం హనుమాన్ దేవాలయంలో సోమవారం సాయంత్రం భక్తిరసధార పేరుతో ఆధ్యాత్మిక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంలో పరం పూజ్యపాద్ శ్రీ భక్తి విక్రం దామోదర్ గోస్వామి మహారాజ్ జీ ప్రవచనం ఇచ్చి భక్తులను ఆధ్యాత్మికత వైపు దారి మరలించారు. మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్, కార్పొరేటర్ శ్రవణ్ హాజరై మహారాజ్ జీ ఆశీస్సులు పొందారు. ఈ సందర్భంగా భక్తులతో మాట్లాడిన ఎంపీ ఈటల రాజేందర్,ఆధ్యాత్మికత మనసుకు శాంతిని, సమాజానికి మేలును అందిస్తుంది. ఇలాంటి కార్యక్రమాలు తరచూ నిర్వహించాలి" అన్నారు.ఈ కార్యక్రమానికి మల్కాజిగిరి బిజెపి సీనియర్ నాయకుడు కొత్తపల్లి ఉపేందర్ రెడ్డి సమన్వయం చేశారు. భక్తుల సమూహం ఉత్సాహంగా పాల్గొని దేవాలయ ప్రాంగణం నిండిపోయిందని పేర్కొన్నారు.

## తిరుమలనగర్ ,సప్తగిరి కాలనీలో కార్పొరేటర్ పర్యటన



**మల్కాజిగిరి అక్టోబరు13,ప్రభాతవార్త :**
ఈస్ట్ ఆనంద్ బాగ్ డివిజన్ పరిధిలోని తిరుమల నగర్ సప్తగిరి కాలనీ ఏరియాలలో కార్పొరేటర్ వై ప్రేమ్ కుమార్ జిహెచ్ఎంసి జలమండలి శానిటేషన్ విభాగం అధికారులతో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా స్థానికులు ఓపెన్ నాల సమస్యను పరిష్కరించాలని అలాగే బహిరంగ ప్రదేశాలలో చెత్త వేయడంతో తీవ్ర ఇబ్బందులు కలుగుతున్నాయని సమస్య పరిష్కరించాలని కోరారు.ఈ కార్యక్రమంలో జలమండలి జిఎం సునీల్ కుమార్ మేనేజర్ నవీన్ ఏఈ సత్యలక్ష్మి మెడికల్ అధికారి మంజుల శానిటేషన్ సూపర్వైజర్ శ్రీనివాస్ వర్క్ ఇన్స్పెక్టర్ రజనీకాంత్ స్థానికులు నర్సింగ్ రావు పవన్ కుమార్ కిషోర్ పాల్గొన్నారు.

## సౌభాగ్యనగర్ సిసి రోడ్డు ప్రారంభం



సిసి రోడ్డును ప్రారంభిస్తున్న కార్పొరేటర్ రాజశేఖర్‌రెడ్డి

**సైదాబాద్, అక్టోబరు 13 ప్రభాతవార్త:**
లింగోజిగూడ డివిజన్ సౌభాగ్యనగర్ కాలనీలో రూ.10.50 లక్షల వ్యయంతో చేపట్టిన సిసి రోడ్డు నిర్మాణం పూర్తి కావడంతో సోమవారం కార్పొరేటర్ దర్పల్లి రాజశేఖర్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డివిజన్‌లోని సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తూ సమగ్రాభివృద్ధికి కృషి చేస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడు శ్రీనివాస్, కిరణ్ కుమార్, వెంకట సురేష్, ఈశ్వర్‌రెడ్డి, సోమశేఖర్, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## బస్తీ దవఖానాను కార్పొరేటర్ అరుణ రవీందర్‌రెడ్డి తనిఖీ



సిబ్బంది నుండి వివరాలు తెలుసుకుంటున్న కార్పొరేటర్ అరుణ రవీందర్‌రెడ్డి

**సైదాబాద్, అక్టోబరు 13 ప్రభాతవార్త:** సైదాబాద్ డివిజన్ క్రాంతి నగర్‌లోని బస్తీ దవఖానాను కార్పొరేటర్ కొత్తకాపు అరుణ రవీందర్‌రెడ్డి సోమవారం ఆకస్మిక తనిఖీ చేశారు. దవఖానాలోని మందులు, రోగులకు అందుతున్న సేవలను పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ అరుణ మాట్లాడుతూ ఆసుపత్రి సిబ్బంది స్థానికుల మెప్పు పొందేలా సేవలు అందించాలని సూచించారు.

## పార్టీ బలోపేతానికి కృషి చేయాలి : ఉప్పల



సంజుగౌడును సన్మానిస్తున్న ఉప్పల శ్రీనివాస్‌గుప్తా

**ఎల్.బి.నగర్, అక్టోబర్ 13 ప్రభాతవార్త:** రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధి పనులను ప్రచారం చేయడంతో పాటు పార్టీ పటిష్టత కోసం కృషి చేయాలని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, అంతర్జాతీయ ఆర్య వైశ్య ఫెడరేషన్ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ ఉప్పల శ్రీనివాస్‌గుప్త పేర్కొన్నారు.ఎల్బీనగర్ నియోజకవర్గం యువజన కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శిగా నియమితులైన సంజుగౌడ్ సోమవారం నాగోల్‌లోని ఉప్పల శ్రీనివాస్‌గుప్త క్యాంపు కార్యాలయంలో కలిశారు. ఈ సందర్భంగా ఉప్పల శ్రీనివాస్‌గుప్త శుభాకాంక్షలు తెలిపి సంజుగౌడును సన్మానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ బలోపేతానికి మరింత భాగ్యయుతంగా పనిచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో లోకేష్, మాణిక్ సాయి, హర్షిత్, సుమన్ తదితరులు పాల్గొన్నారు.

## హబ్సిగూడలో అభివృద్ధి పనులు పరిశీలన



హబ్సిగూడలో అభివృద్ధి పనులు పరిశీలిస్తున్న కార్పొరేటర్ కక్కిరేణి చేతన తదితరులు

**ఉప్పల్, అక్టోబరు 13 ప్రభాతవార్త :**
హబ్సిగూడ డివిజన్ పరిధిలోని గోఖలేనగర్‌లో చేపడుతున్న సిసి రోడ్డు పనులను సోమవారం స్థానిక కార్పొరేటర్ కక్కిరేణి చేతన హరీష్ అధికారులతో కలిసి పరిశీలించారు.ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ గోఖలే నగర్ ప్రజలకు ఇబ్బంది లేకుండా కొత్త రోడ్డు నిర్మిస్తున్నామని తెలిపారు. రోడ్డు పనులలో నాణ్యత ప్రమాణాలు పాటించాలని,ప్రజలకు ఇబ్బంది లేకుండా పనులను త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. అనంతరం కాలనీలో పర్యటించి పలు సమస్యలు తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఇంజనీరింగ్ ఏఈ సాయికిరణ్, వర్క్ ఇన్స్పెక్టర్ రమేష్ రాఠోడ్, పలువురు కాలనీవాసులు పాల్గొన్నారు

## సిఐటియు కార్యాలయంలో ముఖ్యకార్యకర్తల సమావేశం



**తుర్కయంజాల్ అక్టోబర్13, ప్రభాతవార్త**
అక్టోబర్ 14, 15వ తేదీల్లో రంగారెడ్డి జిల్లా తుర్కయంజాల్ మున్సిపల్ పట్టణం, మన్నెగూడలోని నీలం సంజీవరెడ్డి నగర్‌లో గల చలసాని వారి కళ్యాణ మండపంలో జరిగే తెలంగాణ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ (సిఐటియు) రాష్ట్ర 5 వ మహాసభల ఏర్పాట్లను పర్యవేక్షించేందుకు విచ్చేసిన సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్ రాగన్నగూడలోని సిఐటియు కార్యాలయంలో ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా భాస్కర్ మాట్లాడుతూ... తుర్కయంజాల్ పట్టణంలో జరిగే మున్సిపల్ కార్మికుల మహాసభలు కార్మికుల యొక్క జీవితాలను మార్చే విధంగా వారి సమస్యల పైన చర్చించనున్నామని వారు ఎదుర్కొంటున్న సమస్యల మీద భవిష్యత్తులో ప్రభుత్వంతో పోరాటాలకు శ్రీకారం చుడతామని అన్నారు ఈ సందర్భంగా 14వ తేదీ ఉదయం 11 గంటలకు రాగన్నగూడ మున్సిపల్ వార్డు కార్యాలయం నుండి మహాసభ ప్రాంగణం వరకు వేలాది మంది కార్మికులతో మహాప్రదర్శన, బహిరంగ సభ నిర్వహించనున్నామని ఈ కార్యక్రమానికి కార్మిక వర్గం పెద్ద ఎత్తున తరలిరావాలని పిలుపునిచ్చారు. ఈ మహాసభల్లో గత 3 సంవత్సరాల కాలంలో జరిగిన కార్యక్రమాలపై, ప్రభుత్వం కార్మిక వర్గంపై అనుసరించిన విధానాలను సమీక్షించి, భవిష్యత్తు కార్యాచరణను రూపొందించుకొని భవిష్యత్తు కార్యాచరణ రూపొందించుకొని ముందుకు వెళ్తామని అన్నారు. తెలంగాణ ప్రభుత్వానికి ఇప్పటికే అనేక సార్లు మున్సిపల్ కార్మికుల డిమాండ్ల పై అనేకసార్లు ప్రభుత్వానికి విన్నవించిన పట్టించుకునే పరిస్థితి లేదన్నారు అధికారంలోకి రాకముందు కార్మికులందరినీ పర్మనెంట్ చేస్తమని, పనికి తగ్గ వేతనాలు ఇస్తామని చేసిన వాగ్దానాలు అమలు చేసే పరిస్థితి లేదని ఎక్కడ వేసిన గొంగళి అక్కడే ఉందన్నారు. కార్మికులందరికీ వారాంతపు సెలవులతో పాటు ప్రభుత్వ సెలవులను కూడా అమలు చేయాలని స్థానిక సమస్యలను పరిష్కరించాలని ప్రభుత్వ సంక్షేమ పథకాలన్నీ మున్సిపల్ కార్మికులకు వర్తింపజేయాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో యూనియన్ రాష్ట్ర కార్యదర్శి పాలడుగు సుధాకర్ సిఐటియు రంగారెడ్డి జిల్లా కార్యదర్శి ఎం చంద్రమోహన్ జిల్లా ఉపాధ్యక్షులు డి కిషన్, డి జగదీష్, జిల్లా కమిటీ సభ్యులు ఈ నరసింహ, టి నరసింహ, సిహెచ్ ఎల్లేష్ తుర్కయంజాల్ మున్సిపల్ నాయకులు ఎం సత్య నారాయణ, యాదగిరి, తదితరులు పాల్గొన్నారు.

## ఉప్పల్ కురుమనగర్ కాలనీలకు మహర్దశ : రజిత పరమేశ్వర్‌రెడ్డి



ఉప్పల్ కురుమనగర్‌లో పర్యటించి సమస్యలు తెలుసుకుంటున్న కార్పొరేటర్ ఎం.రజిత పరమేశ్వర్‌రెడ్డి తదితరులు

**ఉప్పల్, అక్టోబరు 13 ప్రభాతవార్త :** ఉప్పల్ డివిజన్ పరిధిలోని ఉప్పల్‌హిల్స్,కురుమనగర్, లక్ష్మీనరసింహ నగర్ కాలనీలలో రూ.55 లక్షలతో అభివృద్ది పనులు చేపడుతున్నామని స్థానిక కార్పొరేటర్ మందముల రజిత పరమేశ్వర్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు సోమవారం కురుమనగర్ కాలనీలో పర్యటించి పలు సమస్యలు పరిశీలించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ డివిజన్ పరిధిలో సిఎం రేవంత్ రెడ్డి చొరవతో డివిజన్‌కు భారీగా నిధులు మంజూరు చేయించినట్లు తెలిపారు. గత పదేళ్ల బిఆర్ఎస్ పాలనలో నిధులు రాక, అభివృద్ధి పనులను నిలిచిపోయాయని అన్నారు. సిఎం రేవంత్‌రెడ్డి ఉప్పల్ ప్రాంత అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి పెట్టారని గుర్తు చేశారు. ఉప్పల్ అసెంబ్లీ ఇంచార్జి మందముల పరమేశ్వర్‌రెడ్డి సారథ్యంలో నియోజకవర్గాన్ని అభివృద్ధి పదంలో నడిపిస్తున్నారని, అత్యధికంగా నిధులను మంజూరు చేయిస్తున్నారన్నారు. ఉప్పల్ డివిజన్‌లో అభివృద్ధి పనులు వేగవంతంగా జరుగుతున్నాయని ఆమె పేర్కొన్నారు. ఉప్పల్ హిల్స్ లో రూ.55 లక్షలతో స్ట్రాం వాటర్ పైపు లైన్, ఉప్పల్ లో రూ.27 కోట్లతో నల్లచెరువు అభివృద్ధి, సుందరీకరణ పనులు జరుగుతున్నాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో డిఈ వెన్నెల గౌడ్,ఏఈ రాజ్ కుమార్, కాలనీ నేతలు దుర్గం నవీన్, బాజా అబ్బయ్య, గోవింద్,ఈగ ఆంజనేయులు, సల్లా ప్రభాకర్‌రెడ్డి, పి రామచందర్,మంగ సుధాకర్, టి.శ్రీనివాస్‌రెడ్డి, అక్కు రవి ,కుమారస్వామి, మహేందర్, సంజయ్, కుమార్, ఎన్ కిట్టు, బాజా అబ్బయ్య, నర్సింహ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## శ్రీశ్రీ హోమ్స్‌లో పార్కులు, స్విమ్మింగ్ పూల్ సమస్య పరిష్కారం



సభకు హాజరైన అల్మాస్‌గూడ శ్రీశ్రీ హోమ్స్ కాలనీవాసులు

**సరూర్‌నగర్, అక్టోబర్ 12 ప్రభాతవార్త:** హైదరాబాద్ నగర శివార్లలోని బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ అల్మాస్‌గూడ శ్రీశ్రీ హోమ్స్‌లో దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న పార్కులు, స్విమ్మింగ్ పూల్‌కు సంబంధించిన సమస్యలు పరిష్కారం కావడం పట్ల కాలనీలో అభినందన సభను ఏర్పాటు చేశారు. స్థానిక కాలనీకి సంబంధించిన రెండు పార్కు స్థలాలను కాలనీని ఏర్పాటు చేసిన రియల్ ఎస్టేట్ సంస్థ వారు బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ పేరిట రిజిస్ట్రేషన్ చేశారు. అదే విధంగా గేటెడ్ కమ్యూనిటీకి సంబంధించిన ఈ కాలనీలో నిర్మించిన స్విమ్మింగ్ పూల్‌ను కాలనీ అసోసియేషన్‌కు రిజిస్ట్రేషన్ చేశారు. ఈ నేపథ్యంలో కాలనీవాసులు హర్షం వ్యక్తం చేయగా ఆదివారం కాలనీలో అభినందన సభను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో శ్రీశ్రీ ఎస్టేట్స్ ఛైర్మన్ నర్సింహారెడ్డి, ఎండి భూపతి రాజు, అల్మాస్‌గూడ మాజీ సర్పంచ్ రామిడి రాంరెడ్డి, కాలనీ అధ్యక్షుడు రంజిత్‌కుమార్, ప్రధాన కార్యదర్శి లక్ష్మీ నర్సింహారెడ్డి, కోశాధికారి వెంకట కృష్ణ, ఉపాధ్యక్షుడు ధన్‌రాజు రెడ్డిలతోపాటు కార్యవర్గ సభ్యులు, పాల్గొన్నారు.

## సదశివా హెవెన్స్‌లో తాళాలు పగులగొట్టి చోరీ

**హయత్ నగర్, అక్టోబర్ 13 ప్రభాతవార్త:**
పెద్ద అంబర్పేట్ లోని సదాశివ హెవెన్స్‌లో ఈనెల 11న రాత్రి రెండిళ్ళల్లో ఇంటి తాళాలు పగులగొట్టిన దుండగులు బంగారు, వెండి ఆభరణాలు కొంత నగదును అపహరించుకు పోయారు. పోలీసుల కథనం ప్రకారం వివరాలు... సదాశివ హవెన్స్ లో నివాసముండే గూడూరు రాజేందర్ రిటైర్డ్ లెక్చరర్. అతను అనారోగ్య కారణంగా కొంత కాలంగా స్వగ్రామమైన హన్మకొండ లోని శేషానగర్ లో కుటుంబం తో సహ ఉంటున్నారు. అప్పటినుండి సదాశివ లెవెల్స్ లో ఇంటిలో పనిమనిషి మాత్రం ఇంటిని శుభ్రం చేస్తూ తాళం వేసి వెళుచున్నది. ఈనెల 12న ఉదయం 8 గంటలకు వచ్చి చూడగా ఇంటి డోర్ ఓపెన్ చేసి ఉండడంతో దొంగలు పడ్డ విషయం తన యజమానికి తెలియ పరచినది. అదే కాలనీలోని విల్లా నెంబర్ 246 లో నివాసముండే కృష్ణారెడ్డి నెల క్రితం ఇంటికి తాళం వేసి అమెరికా వెళ్లాడు. దుండగులు ఆ ఇంటి తాళం కూడా పగులగొట్టి దొంగతనానికి పాల్పడ్డారు. రెండు సంఘటనల్లో దుండగులు 3.5 తులాల బంగారం, 5 కిలోల వెండి, 60 వేల నగదు అపహరించుకుపోయారు. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## బహిరంగ ప్రదేశంలలో చెత్త వేస్తే జరిమానా



బోడుప్పల్ నగరపాలక సంస్థలో ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న కమిషనర్ శైలజ , సానిటరీ ఇన్స్పెక్టర్ శ్రీనివాస్ రెడ్డి

**బోడుప్పల్ ,అక్టోబర్ 13 ప్రభాతవార్త :** బోడుప్పల్ నగర పాలక సంస్థలో పలు చెత్త వేసే ప్రాంతములను గుర్తించి తక్షణమే చెత్త ను శుభ్రం చేయాలని,ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాన్ని ఏర్పాటు చేయాలని కమీషనర్ శైలజ పారిశుధ్య అధికారులను, సిబ్బంది ని ఆదేశించడం జరిగినది.ఇట్టి ఆదేశములతో సోమవారం డివిజన్ 7 శివాలయం రోడ్డు లో ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమం లో భాగముగా చెత్త ను తొలగించడం జరిగినది.ఈ సందర్భంగా కమీషనర్ మాట్లాడుతూ... ఎవరైనా బహిరంగ ప్రదేశములలో చెత్త వేస్తే భారీ జరిమానా తో పాటు క్రిమినల్ చర్యలు మున్సిపల్ చట్టమును అనుసరించి విధించబడునని హెచ్చరించారు. ప్రజలందరూ చెత్త ను స్వచ్ఛ వాహనములకు అందచేసి స్వచ్ఛ బోడుప్పల్ కు సహకరించాలని కోరారు.ఈ కార్యక్రమంలో సానిటరీ ఇన్స్పెక్టర్లు శ్రీనివాస్ రెడ్డి, సంగీత, పారిశుధ్య సిబ్బంది పాల్గొన్నారు.

## నిండు జీవితానికి రెండు చుక్కలు:చిలుక



పోలియో చుక్కలు వేస్తున్న ఉపేందర్‌రెడ్డి

**ఎల్.బి.నగర్, అక్టోబర్ 13 ప్రభాతవార్త:**
చిన్నారుల నిండు జీవితానికి రెండు పోలియో చుక్కలు వేసిపోలియోపై విజయం సాధించాలని రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు చిలుక ఉపేందర్‌రెడ్డి పేర్కొన్నారు. ఆర్.కె.పురం డివిజన్ శ్రీరామకృష్ణాపురం కాలనీ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన అయిదు సంవత్సరాల లోపు పసి పిల్లలకు పల్స్ పోలియో చుక్కలు వేసే కార్యక్రమంలో చిలుక ఉపేందర్ రెడ్డి పాల్గొని చిన్నారులకు చుక్కలు వేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అయిదు ఏళ్ల లోపు పిల్లలందరికి పోలియో చుక్కలు వేయించాలని, చిన్నారుల బంగారు భవిష్యత్తుకు బాటలు వేయాలని పిలుపునిచ్చారు. బిడ్డ అంగ వైకల్యాన్ని ఎదుర్కొనే ఏకైక మార్గం పోలియో చుక్కలే అన్నారు. చిన్నారుల తల్లిదండ్రులు 5 ఏళ్ల లోపు పిల్లలందరికి పోలియో చుక్కలు వేయించి, పోలియో రహిత సమాజాన్ని స్థాపిద్దాం అన్నారు.ఈ కార్యక్రమంలో ఐటిడిఈఎస్ సొసైటీ పెద్దలు రాజశ్రీ రామారావు, పాండు, విప్లవ్‌రెడ్డి, ఏఎన్ఎం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



పోలియో చుక్కలు వేస్తున్న సురేందర్‌యాదవ్

**నాగోల్ డివిజన్ పరిధిలో**
చిన్నారుల నిండు జీవితానికి రెండు పోలియో చుక్కలు వేయాల్సిన అవసరం ఉందని బిజెపి ఓబీసీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు చింతల సురేంద్రనాథ్‌యాదవ్ పేర్కొన్నారు. నాగోల్ డివిజన్ పరిధిలోని గవర్నమెంట్ హైస్కూల్, సాయినగర్‌కాలనీలో 5 సంవత్సరాలలోపు చిన్నారులకు పోలియో చుక్కలు వేసే కార్యక్రమంలో ఆయన పాలు గురించి చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు.ఈ కార్యక్రమంలో డాక్టర్ ఎన్. సరస్వతి. స్టాప్ అంజి, ఫార్మసీ సుజాత, ప్రియాంక, శారది, ఆరోగ్య అధికారులు, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు, స్థానిక నాయకులు, కాలనీ వాసులు పాల్గొన్నారు.

## 17న హోమియోపతి కళాశాలలో హోమియోపతి ఎక్స్‌పో



హోమియోపతి ఎక్స్‌పో -2025 బ్రోచర్ అవిష్కరిస్తున్న హోమియో కళాశాల ప్రిన్సిపల్ డా.లింగరాజు తదితరులు

**రామంతాపూర్, అక్టోబరు 13 ప్రభాతవార్త :** రామంతాపూర్ హోమియోపతి కళాశాలలో ఈనెల 17, 18 తేదిలలో హోమియోపతి ఎక్స్‌పో -2025 కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ డా.లింగరాజు తెలిపారు. ఈ మేరకు సోమవారం రామంతాపూర్ హోమియోపతి కళాశాలలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వైస్ ప్రిన్సిపల్ డా.శ్రీనివాస్‌రెడ్డి, డా.కె.కృష్ణమూర్తి, ప్రోగ్రాం ఇంచార్జ్ డా.పార్థసారధి తదితరులతో డా.లింగరాజు మాట్లాడుతూ హోమియోపతి వైద్య విధానాన్ని ప్రజలల్లోకి తీసుకుని వెళ్లేందుకు వివిధ కార్యక్రమాలు చేపడుతున్నామని తెలిపారు. ఇందులో భాగంగా ఈనెల 17, 18 తేదిలలో పలు కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. వైద్య శిక్షణ గురించి విద్యార్థులకు అవగాహన కల్పించడంతో పాటు, వివిధ వనరుల నుంచి మందులు ఎలా తయారు చేస్తారనే విషయంపై అవగాహన కల్పిస్తామని తెలిపారు.ఉదయం 9.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఈ ప్రదర్శనలు ఉంటాయని తెలిపారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనరసింహాతోపాటు, హోమియోపతి వైద్య శాఖ ఉన్నతాధికారులు పాల్గొంటారని తెలిపారు. ఈ సమావేశంలో పలువురు అధికారులు పాల్గొన్నారు.

## అభయాంజనేయ స్వామిగుడి నిర్మాణానికి లక్ష విరాళం



చెంగిచెర్ల ద్వారకా నగర్ శ్రీ అభయ అంజనేయ స్వామి గుడి నిర్మాణానికి లక్ష రూపాయల విరాళాల చెక్కును ఇస్తున్న మాజీ కార్పొరేటర్ బింగి జంగయ్య యాదవ్

**బోడుప్పల్ , 13 ప్రభాతవార్త :** బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ చెంగిచెర్ల ద్వారకా నగర్ కాలనీ ఫేస్2 లో శ్రీ అభయాంజనేయ స్వామి గుడి నిర్మాణానికి బింగి జంగయ్య యాదవ్ లక్ష రూపాయలు విరాళంగా అందించారు. కాలనీవాసులు ఆయనకు మర్యాద పూర్వకంగా కలిసి,వారి తరపున ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాలనీ అధ్యక్షులు రాజు గౌడ్, కమిటీ సభ్యులు , కాలనీవాసులు పాల్గొన్నారు.

## పూజారి కుటుంబానికి బ్రాహ్మణ సంఘం అండ



రోడ్డు ప్రమాదానికి గురైన పూజారి కుమారుని వైద్య చికిత్సల కోసం రూ.50 వేల ఆర్థిక సాయాన్ని అందజేస్తున్న బ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు మంగు రాఘవరావు

**సరూర్‌నగర్, అక్టోబర్ 13 ప్రభాతవార్త:** రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి ఆసుపత్రి పాలైన పేద పూజారి కుమారునికి ఆపరేషన్, వైద్య చికిత్సల కోసం బ్రాహ్మణ సంఘాల నాయకులు రూ.50 వేల ఆర్థిక సాయాన్ని అందించి మానవత్వం చాటుకున్నారు. బడంగ్‌పేట్ కార్పొరేషన్ అల్మాస్‌గూడ షిర్డీనగర్‌లోనున్న శ్రీ గోదా లక్ష్మీ సమేత శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయ పూజారి లక్ష్మణాచార్యుల కుమారుడు నవీన్ (34) వారం క్రితం లారీ ఢీకొట్టడంతో ప్రమాదానికి గురై రెండు కాళ్లు విరిగాయి. దీంతో బాధితుడు చంపాపేట్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. అయితే ఆపరేషన్, ఆసుపత్రి వైద్య ఖర్చులను పూజారి కుటుంబం భరించలేని స్థితిలో ఉండడంతో స్పందించిన బడంగ్‌పేట్, రంగారెడ్డి జిల్లా బ్రాహ్మణ సేవా సంఘం అధ్యక్షులు మంగు రాఘవరావు, ఉపాధ్యక్షులు వేముల కవిత, బిఎల్ నవీన్ కుమార్, సహాయ కార్యదర్శి నందూరి ప్రకాశ్, కార్యవర్గ సభ్యులు గోగులపాటి శ్రీనివాసరావు, జనగాం ఉమా శంకర్‌రావు, మహిళా కమిటీ కార్యనిర్వాహక కార్యదర్శి ఇంగువ సౌమిత్రి, ఆలయ కమిటీ ఛైర్మన్ హరికృష్ణ, వైస్ ఛైర్మన్ రంగారావుల సమక్షంలో రూ.50 వేల నగదును పూజారి లక్ష్మణాచార్యులకు అందజేశారు.

## బిజెపి ఓట్ల చోరీ ఆటలు సాగవు : బోయపల్లి గోవర్ధన్‌రెడ్డి



మామిడిపల్లి గ్రామంలో సంతకాల సేకరణ కార్యక్రమాన్ని ప్రారంభించిన బోయపల్లి గోవర్ధన్‌రెడ్డి

**సరూర్‌నగర్, అక్టోబర్ 13 ప్రభాతవార్త:** కేంద్రంలో ఉన్న బిజెపి ప్రభుత్వం పలు రాష్ట్రాల్లో ఓట్ల చోరీకి పాల్పడి అధికారంలోకి వచ్చిందని గడ్డిఅన్నారం వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్, బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ కాంగ్రెస్ పార్టీ ఇంఛార్జి బోయపల్లి గోవర్ధన్‌రెడ్డి అన్నారు. రాహుల్ గాంధీ పిలుపు మేరకు బడంగ్‌పేట్ కార్పొరేషన్‌లోని మామిడిపల్లి గ్రామంలో కాంగ్రెస్ ఆధ్వర్యంలో జరిగిన ఓటు చోరీపై సంతకాల సేకరణ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా సంతకాల సేకరణను ప్రారంభించిన ఆయన మాట్లాడుతూ రాహుల్ గాంధీ చేపట్టిన ఉద్యమంతో ఇక బిజెపి ఓట్ల చోరీ ఆటలు సాగవని స్పష్టం చేశారు. క్షేత్ర స్థాయిలో కాంగ్రెస్ కార్యకర్తలు ఇంటింటికి తిరిగి బిజెపి ఓట్ల చోరీపై ప్రజల అభిప్రాయాలను తెలుసుకొని సంతకాల సేకరణ చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపిటిసి ఆదిల్ల జంయ్య, ఎస్సీ సెల్ అధ్యక్షుడు కుమార్, నాయకులు విజయ్, నరేందర్, కృష్ణ, బాలకృష్ణ, రాము నాయక్, రాంబాబు, బిక్షపతి, యూత్ కాంగ్రెస్ నాయకులు, పాల్గొన్నారు.

## బడంగ్‌పేట్ మారుతీనగర్‌లో కాంగ్రెస్ నేతల పాదయాత్రలు



మారుతీనగర్‌లో పర్యటిస్తున్న కాంగ్రెస్ నాయకులు

**సరూర్‌నగర్, అక్టోబర్ 13 ప్రభాతవార్త:**
బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లోని 23వ డివిజన్ మారుతీనగర్ కాలనీలో కాంగ్రెస్ మాజీ ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు పర్యటించి ప్రజల సమస్యలను పరిశీలించారు. మున్సిపాలిటీ మాజీ వైస్ ఛైర్మన్ చిగిరింత నర్సింహారెడ్డి స్థానిక మాజీ కార్పొరేటర్ పెద్దబావి సుదర్శన్‌రెడ్డి, సీనియర్ నాయకుడు రాళ్ళగూడెం శ్రీనివాస్‌రెడ్డి తదితరులతో కలిసి పాదయాత్రలు చేసి పర్యటించి ప్రజలను సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత కౌన్సిల్ సమావేశంలో తీర్మాణం చేసిన పనులను త్వరగా ప్రారంభించాలని అధికారులను కోరారు. డ్రైనేజీ, సిసి రోడ్ల నిర్మాణం జరిగేలా కృషి చేస్తామని కాలనీ వాసులకు హామీనిచ్చారు. ఈ కార్యక్రమంలో కాలనీ సభ్యులు లింగం, వెంకటేశ్‌గౌడ్, వెంకటేశ్, రమాదేవి, పలువురు మహిళలు పాల్గొన్నారు.

## దశలవారీగా సమస్యలను పరిష్కరింపజేస్తాం



కాలనీల్లో డ్రైనేజీ సమస్యలు పరిశీలిస్తున్న బోయపల్లి రాఘవేందర్‌రెడ్డి

**సరూర్‌నగర్, అక్టోబర్ 13 ప్రభాతవార్త:** బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లోని అల్మాస్‌గూడ కాలనీల్లో దశల వారీగా ప్రజా సమస్యలను పరిష్కరింపజేస్తామని ఎఐసిసి తరుణ్ విచార్ విభాగ్ కో-ఆర్డినేటర్ బోయపల్లి రాఘవేందర్‌రెడ్డి అన్నారు. స్థానిక 24, 26 డివిజన్లలోని ఎంఆర్ఆర్ కాలనీ, శ్రీ సాయిహోమ్స్, వెంకటేశ్వర కాలనీలలో ఆదివారం పర్యటించి డ్రైనేజీ సమస్యలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అభివృద్ధి, సమస్యల పరిష్కారం కాంగ్రెస్ పాలనలో సాధ్యమవుతుందని స్పష్టం చేశారు. నియోజకవర్గ కాంగ్రెస్ ఇంఛార్జి, మాజీ మేయర్, కమీషనర్ల దృష్టికి తీసుకెళ్ళి అల్మాస్‌గూడ కాలనీల డ్రైనేజీ, రోడ్లు తదితర సమస్యలను పరిష్కరిస్తామని ఆయన కాలనీవాసులకు హామీనిచ్చారు. ఈ కార్యక్రమంలో కాలనీ సభ్యులు వెంకటాచారి, మాధవరెడ్డి, తారాచంద్, వీరులాల్, వెంకట్రాం, మోహన్ నాయక్, శశికాంత్,వీరన్న, జనార్ధన్ పాల్గొన్నారు.

**అపరిశుభ్రంగా తయారైన చిన్న చెరువు పరిసరాలు : గిరిబాబు**
**రామంతాపూర్, అక్టోబరు 13 ప్రభాతవార్త :** రామంతాపూర్ చిన్న చెరువు సుందరీకరించి అభివృద్ధి చేయాలని టిడిపి సీనియర్ నేత కొండ్రన్‌పల్లి గిరిబాబు పేర్కొన్నారు. ఈ మేరకు సోమవారం రామంతాపూర్ చిన్న చెరువు పరిసరాలను పలువురు పార్టీ నేతలతో కలిసి పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సిఎం రేవంత్‌రెడ్డి హైడ్రా పేరుతో చెరువుల సంరక్షణ చేస్తున్నారని, రామంతాపూర్‌లో చెరువును పట్టించుకోవడం లేదన్నారు. చిన్న చెరువు మత్తు పదార్థాలు సేవించే యువతకు అడ్డంగా మారిందని, చెరువులో గుర్రపు డెక్క పేరుకపోవడం వల్ల దుర్వాసన వస్తుందన్నారు.అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని కోరారు.